₹ 40

ఏప్రిల్ - 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## BALA CHELIMI

సంపుటి : 33 • సంచిక : 7

Telugu Children's Monthly Magazine

APRIL - 2024




Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ. 330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ. 350 • తగ్గింపు ధర రూ. 300**



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక
BALA CHELIMI
Telugu Children's Monthly Magazine

సంపుటి: Volume: 33 | సంచిక : Issue : 7 | హైదరాబాద్ Hyderabad | ఏప్రిల్ April | పేజీలు Pages 52 | రూ. ₹. 40

## లోపలి పేజీల్లో.......








బాలచెలిమి విశిష్ట కలిమి ............................ మణికొండ వేదకుమార్ .......... ................... 5
తెలుగు వారి తొలి పండుగ (పండుగ).............. (బాల చెలిమి)............. ...................... 6
సోమరిపోతు పావురం (కథ)......................... యం. మల్లీశ్వరి...................... ............. 7
ఒక 'టీచరు' (కథ).................................. అల్లెం గోపిచంద్ .................................. 8
ఉప్పు మర (కథ)................... .................... ఎస్. శ్రీనివాసరావు ................................. 9
నేస్తం (కథ)..................... .................... తురగా జానకీరాణి................. .............. 11
మానవత్వం (కథ)........... ........................ కె. మాధవి ......................................... 13
కప్పు గంతులు ......................................... (ఆటాడుకుందామా!) ............................. 14
సాధించాలనే కోరిక (కథ).......................... వి. దుర్గాభవాని ......... ....................... 15
చిలిపి చిలుక (కథ) ......................... ........ భోగోజు ఉపేందర్‌రావు .......................... 18
జరభద్రం (ఆరోగ్యం) ........................ ........ బాలచెలిమి డెస్క్.................................. 19
నేత్రదానం (కథ) ...................................... కె. భవాని........................................... 20
కష్టేఫలి (కథ) ......................................... ఓ. శ్రేయ ................. ...................... 21
ముట్టుకోకుండా దారాన్ని కోయడం (సైన్స్).......... మహీధర నళినీ మోహన్......................... 22
సముద్రాలూ కలుషితమవుతున్నాయి ................. (పర్యావరణం)...................................... 23
మూఢ నమ్మకాలు (కథ)............................. వాసరవేణి శ్రీవివేక్.............................. 24
అమ్మమ్మ ఐడియా .................................... (కార్టూన్స్) ........................... ........... 26
దురాశ (కథ).......................................... సర్వజ్ఞ............................................. 28
ఇప్పు చెట్టు (చెట్టు-చేమ) .......................... బాలచెలిమి డెస్క్.................................. 29
రాక్షసుడు (కథ) ...................................... రావి కొండలరావు ................................ 31

నిద్ర ఖరీదు (కథ)........................................ మల్లెల సాహిత్య ........................................ 34
కుక్క-దొంగ (కథ)........................................ లియో టాల్‌స్టాయ్ ........................................ 35
జిహ్వ చాపల్యం(కథ) ........................................ ఉప్పల పద్మ ........................................ 36
ధాం... ధాం... ........................................ (గేయం) ........................................ 38
అబద్ధం (కథ)........................................ పెనుగొండ బసవేశ్వర్ ........................................ 39
హార్న్‌బిల్ (పక్షి)........................................ (బాల చెలిమి) ........................................ 41
"స్ఫూర్తి" (కథ) ........................................ ఉండ్రాల రాజేశం ........................................ 42
క్రీడలు........................................ మీనాస్వామినాథన్ ........................................ 43
చెలిమి క్లబ్ ........................................ (బాల చెలిమి) ........................................ 44
ప్రయాణం(కథ) ........................................ గద్వాల కిరణ్‌కుమారి........................................ 45
మరో గ్రంథాలయ ఉద్యమ సభ విజయవంతం... .. మంచికంటి........................................ 46
మాడభూషి రంగాచార్య స్మారక కథల పోటీ బహుమతుల ప్రదానోత్సవం ........................................ 48
అక్కమహాదేవి గుహలు ........................................ (యాత్ర) ........................................ 49
నిద్ర (చిన్న కథ)........................................ భూపాల్ ........................................ 49
నేనూ నా బాల్యం (వ్యక్తిత్వం) ........................................ (బాల చెలిమి)........................................ 50


## పబ్లిషర్స్ నోట్

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోడానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడ ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'. రెండు సంవత్సరములు (2018 నుండి 2020 సం॥) చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం 'బాలచెలిమి' ముచ్చట్లు నిర్వహించింది. బాలసాహితీవేత్తలు, ఐ.టి. తదితర రంగాలకు చెందిన సాంకేతిక శాస్త్ర నిపుణులు, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలకు చెందిన నిష్ణాతులు అనేక మంది తమ తమ అనుభవాలను పంచుకున్నారు. పిల్లల బహుముఖ అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంలో అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు బాల చెలిమి చక్కని ఉపకరణంగా ఉండాలనే ఆశయంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ఈ సంవత్సరం జనవరి నుండి బాల చెలిమిని మరింత ఆకర్షణీయ రంగులతో, విశేషాలతో మీ ముందుకు తెస్తున్నది. బాల బాలికలు, విద్యార్థినీ విద్యార్థుల, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు, బాలసాహితీ రచయితలు అందరూ 'బాలచెలిమి'ని ఆదరించి, తమ ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతున్నాం.




*ముఖచిత్రం:*
కప్పరి కిషన్
*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్




**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# బాలచెలిమి విశిష్ట కలిమి

బాలచెలిమి పిల్లల వికాస పత్రిక పునః ప్రారంభమయ్యాక మీ చేతిలో ఉన్న ఈ సంచిక నాల్గవది. ఒక్కో సంచిక దేనికది కొత్తదనాన్ని నింపుకొని నూతన శీర్షికలతో ఆసక్తి కలిగించేలా మీ ముందుకు వస్తున్నది. ఆస్వాదించండి. బాలచెలిమి కేవలం వినోదాన్ని ఇచ్చే హాస్య కథలకు పరిమితం కాలేదు. వినోదంతో బాటు వికాసాన్నిచ్చే భావ సంచలనం బాలచెలిమి.

వికాసం అంటే వికసించడం. పూలు వికసించినప్పుడే పరిమళాన్నిస్తాయి. వికాసం అంటే అభివృద్ధి కూడా. బాలబాలికల్లో మానసికాభివృద్ధిని కలిగించి తద్వారా వారిలో విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదం చేయడం బాలచెలిమి లక్ష్యం. ప్రతి కథా ఒక మెసేజ్ ఇస్తుంది. ఈ కథలు ప్రేమ, దయ, క్షమ, మైత్రి, తోటి మనుషులతో సామరస్య భావన, అభిప్రాయాలను, ఆలోచనలను పరస్పరం పంచుకోవడం వంటి సానుకూల దృక్పథానికి పునాదులు వేస్తాయి. ఇందులోని కథలు, కవితలు, గేయాలు, సామెతలు, సైన్సు సంగతులు ఆనందంతో పాటు పిల్లల్లో తామూ రచనలు చేయాలనే ఉత్సాహాన్ని కలిగిస్తాయి.



ఈ నెల పండుగల నెల. ప్రకృతి పారవశ్యంతో పరవశించే వసంతాల హేల తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఈ నెల 9న, శాంతియుత జీవనాన్ని ప్రబోధించే రంజాన్‌ను 11వ తేదీన జరుపుకోబోతున్నాం. పండగలంటేనే ప్రజల మధ్య అలాయి బలాయి తనాన్ని పెంచే ఉత్సవాలు. తారతమ్యాలు లేకుండా ప్రజలందరూ ఒకరినొకరు ఉత్సాహంగా పలకరించుకుంటూ సంబరాల్లో భాగస్వాములవుతారు. మరి ఈ రెండు పండగలనూ పెద్దవాళ్లతో, మీబోటి పిల్లలతో ఎంజాయ్ చేస్తారు కదూ!

భారతదేశ ప్రజలమైన మనము మనకు ఇష్టమైన జీవితాలను నిర్మించుకుని మన కలలను సాకారం చేసుకోవడానికి దోహదం చేసే విశిష్ట సాధనం మన ఉన్నత రాజ్యాంగం. ఆ రాజ్యాంగ రూపకర్త బి.ఆర్. అంబేద్కర్ పుట్టిన రోజు ఏప్రియల్ 14. డా. బి.ఆర్. అంబేద్కర్‌కి జేజేలు చెబుదాం.

మన బాలచెలిమిని విద్యార్థినీ విద్యార్థులూ, ఉపాధ్యాయులూ తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, బాలసాహితీకారులు ఎప్పటిలా ఆదరించి ప్రోత్సాహం అందించాలని కోరుతున్నాం.

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్ బాలచెలిమి




# తెలుగు వారి తొలి పండుగ ఉగాది

తెలుగువారి తొలి పండుగ 'సంవత్సరాది'. సంవత్సరాది అంటే సంవత్సరం ప్రారంభ దినం. చైత్రశుద్ధ పాడ్యమినాడు మనం జరుపుకొనే ఈ సంవత్సరాదినే 'ఉగాది' అని పిలుస్తారు. 'యుగాది' అనే పదం నుంచే ఈ 'ఉగాది' వచ్చిందని చాలా మంది అభిప్రాయం. ఈ ఉగాదితో తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది.

ప్రకృతి అంతా పచ్చగా పరవశంతో చిగురు తొడిగి కనువిందు చేస్తుంది. చలి పీడ తగ్గి, వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది. కోయిల పాటలతో ప్రకృతి పులకరిస్తుంది. సంక్రాంతి నాటికే పంటలు చేతికి రావడంతో రైతులు ధనధాన్య సమృద్ధితో తులతూగుతుంటారు. ఇలాంటి ఆనందకరమైన తొలి పండుగ ఉగాది. పుట్టు పూర్వోత్తరాలకు సంబంధించిన అనేక పురాణ గాథలు, చారిత్రక కథలు ప్రచారంలో ఉన్నాయి.

ఉగాదిని దేశదేశాలలో విభిన్న రీతులలో జరుపుకుంటారు. మహారాష్ట్రులు ఉగాదిని 'గుడి-పదవా' పేరుతో, అస్సాంలో "బిహూ" పేరుతో, ఇలా వివిధ ప్రాంతంలో వివిధ రకాల పేర్లతో జరుపుకుంటారు.

ఉగాది నాటి ఉదయం తెలుగువారంతా మంగళాభ్యంగన స్నానాలు చేసి కొత్త బట్టలు ధరిస్తారు. ఇంటి గుమ్మాలకు మామిడాకు తోరణాలు కడతారు. సంవత్సరాది దేవతతోపాటు నూతన పంచాంగాన్ని పూజిస్తారు. ఉగాది పచ్చడి చేసి తాగుతారు. కొత్త చింతపండు, వేపపువ్వు, లేత మామిడి కాయ ముక్కలు, కావలసినంత ఉప్పు, కొద్దిపాటి మిరియాలు, కొత్త బెల్లం, మొదలైన వాటిని కొత్త కుండలో ఉంచి తగిన నీళ్ళుపోసి ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. కొన్ని ప్రాంతాలలో గసగసాలు, పప్పులు కూడా కలుపుతారు. ఈ పచ్చడిని పచ్చని ఆకుదొప్పల్లో వడ్డించుకొని తాగడం వలన సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందంటారు. ఉగాది పచ్చడి ఆరు రుచులతో ఉంటుంది. తీపి, కారం, చేదు, వగరు, ఉప్పు, పులుపు అనే షడ్రుచులు ఇందులో ఉంటాయి. అందుకే ఉగాది పచ్చడి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందనుకోవచ్చు. ప్రాచీన సంప్రదాయాల వెనుక మహత్తరమైన వైద్యవిజ్ఞానం ఇమిడి ఉందనేందుకు ఈ పచ్చడే ప్రత్యక్ష సాక్ష్యం. ఇలా ప్రకృతి వికాసాన్ని మనలో కొత్త జీవన చైతన్యాన్ని చాటి చెప్పే ఉగాది వంటి పండుగలు ప్రపంచమంతా ఉన్నాయని భావించవచ్చు.

జపాన్ బాల బాలికలు 'కిమోవా' అనబడే ప్రత్యేక దుస్తులను ధరించి, రకరకాల జంతువుల వేషాలు ధరించి వీధులలో ఆడుతూ పాడుతూ సరదాగా గడుపుతూ పరస్పరం ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటారు.


(మార్చి 1991 బాలచెలిమి)

కథ

# సోమరిపోతు పావురం

అనగనగా ఒక అడవి నందు మూడు పావురాలు కలిసి మెలిసి జీవించేవి. అవి మంచి స్నేహితులు. అందులో ఒక పావురం బద్ధకంగా జీవించేది. ఏ పని చేద్దాం అన్నా ఎప్పుడూ అడ్డుపడుతుండేది. నేను రాను మీరు వెళ్ళండి అని చెప్పేది. మిగిలిన రెండు పావురాలు ఆహారం కోసం బయటికి వెళ్ళి కష్టపడి ఆహారం సంపాదించుకుని సంతోషంగా జీవించేవి. కాని సోమరి పావురం మాత్రం ఎప్పుడు బద్ధకంగా నిద్ర పోతుండేది. ఒకరోజు పెద్దగాలివాన వచ్చింది. ఆ వానకు పావురాల గూళ్లు చెట్టు మీద నుండి కొట్టుకు పోయాయి. కష్టించి పని చేసి రెండు పావురాలు ఒక పెద్ద చెట్టు మధ్యలో తమ తమ గూళ్లను బలిష్టంగా నిర్మించుకున్నాయి. కాని సోమరి పావురం ఎలాంటి గూడును తిరిగి నిర్మించుకోలేదు. ఒక రోజు సాయంత్రం తిరిగి పెద్ద గాలి వీచింది. ముసురు పట్టి ధారాపాతంగా వర్షం కురవడం మూలంగా గూడు లేని సోమరి పావురం పూర్తిగా తడిచి చలికి వణుకుతూ వుంది. అప్పుడు తమ స్నేహితులైన మరో రెండు పావురాలు గుర్తుకు వచ్చాయి. ఆ సోమరి పావురం తమ మిత్రుల ఇంటికి వెళ్ళి తలుపు తట్టింది. ఆ ఇంట్లో ఉన్న పావురం వచ్చి తలుపు తీసి సోమరి పావురానికి ఆశ్రయాన్ని ఇచ్చింది.

వాన తగ్గాకా పావురం ఇంటి నుండి బయటికి వెళ్ళుతుంటే ఇంట్లో ఉన్న పావురం ఇలా అన్నది. "ఎప్పటి పని అప్పుడే చెయ్యాలి మిత్రమా. మేము ఇళ్లు కట్టుకునేటప్పుడు నువ్వు కూడా ఇల్లు కట్టుకుని వుంటే ఇప్పుడు ఇలా గాలివాన వచ్చినప్పుడు కష్టపడేదానివి కాదు! ప్రమాదాన్ని ఎదుర్కొనే దానివి కాదు కదా!" అని అన్నది. అప్పుడు ఆ సోమరి పావురం, సిగ్గుతో తలవంచుకొని, ప్రశ్చాతాపంతో తిరిగి వెళ్ళింది. ఇంకో పావురం మిత్రుడు వచ్చి, 'మిత్రమా సమయం గడిచిపోతే సమయం తిరిగిరాదు అందుకే, మనం ఏ పని చేయ్యాలన్నా, సమయాన్ని దృష్టిలో పెట్టుకొని సకాలంలో అనుకున్న పనిని సాధించాలి' అని వివరించింది. సోమరి పావురం సిగ్గు తెచ్చుకొని, ఆనాటి నుండి సోమరితనాన్ని వదిలి కష్టించి సమయపాలనతో సంతోషంగా జీవించేది.



నీతి : "రేపటి పని ఈరోజు చేయండి. ఈ రోజు పని ఇప్పుడే చేయండి. సమయ పాలనను మించిన సంపదలేదు.

– యం. మల్లీశ్వరి

# ఒక 'టీచరు'

అక్కయ్య 9వ తరగతి చదువుతోంది. వారి బడిలో ఒక స్నేహితురాలు ఉంది. వాళ్ళ అమ్మ అనుకోకుండా చనిపోయిందట. వారి బడిలోని టీచరు పద్మజ హాజరు తీసుకుంటూ కమలా.. అని పిలిచింది. 'వాళ్ళమ్మ చనిపోయింది. మేడం. ఇప్పుడే ఏడుస్తూ వాళ్ళింటికి వెళ్ళింది'. అన్నారు, తరగతి పిల్లలంతా, వెంటనే ఆ టీచరు కమల వారింటికి వెళ్ళింది. అక్కడ కమల ఏడుస్తూ ఉంది. తల్లి గురించి పట్టించుకునే వారు లేరు. నిరుపేద కుటుంబం బాధ్యత మోసేవారు లేరని టీచరుకు అర్థమయింది. కమలను పిలిచింది టీచర్. "కమలా! ధైర్యం తెచ్చుకో, అమ్మలేదని దిగులు పడకు, నేను నీ అమ్మనే కదా! ఇంద తీసుకో, ఖర్చులకు అవసరం పడుతుంది. కార్యం వెల్లదీసుకో'' అంటూ టీచరు రెండువేల రూపాయలు ఇచ్చింది. కమల ఒక్కసారిగా బోరుమని విలపించింది. ఎవరు ఎంత ఆపినా ఆగలేదు. టీచరే కమలను ఓదార్చింది. శాంత పడిన తర్వాత విషయం తెలిపింది.



'టీచర్! నేను పెద్ద తప్పు చేశాను. మీకు తెలియకుండా మీ బ్యాగులోంచి డబ్బులు దొంగతనం చేశాను. ఆ డబ్బులు సమయానికి అందక, మీ అమ్మగారు రోగంతో చికిత్స అందక చనిపోయిందని తెలిసింది. అప్పుడు తెలియలేదు. ఆ పాపము ఈ రోజు నాకు తాకింది. నాకు మా అమ్మను లేకుండా చేసింది. ఇంత చేసినా మళ్ళీ మీరు నాపైన ప్రేమ చూపించారు. జీవితంలో దొంగతనం చేయనమ్మా'! అంటూ బావురుమంది.

'తప్పు చేయకు, చెడ్డ పనులు హాని చేస్తాయి. బాగా చదువుకో, మంచిదాని వనిపించుకో' అని ఓదార్చింది టీచరు. అంతేకాదు, ఇంట్లో వాళ్ళకు ఇబ్బంది కనుక, సమీప కస్తూరిబాగాంధి బాలికా విద్యాలయంలో చేర్పించింది. అప్పుడప్పుడు వచ్చి ధైర్యం నూరిపోస్తూ, చదువులో మంచి ఫలితాలు రావడానికి తోడ్పడింది.

– అల్లెం గోపిచంద్

# ఉప్పు మర



అనగా అనగా ఒక ఊళ్ళో ఒక పేదవాడు ఉండేవాడు. ఒకసారి అతనికి వారం రోజులపాటు తినడానికి బుక్కెడు బువ్వ కూడా దొరకలేదు. ఆకలితో నకనకలాడి పోయాడు. పొరుగునే ఉన్న ఒక ధనవంతుడి ఇంటికి వెళ్ళి –

"దొరా! కడుపు కాలుతోంది. తినడానికింత ఏదైనా పెట్టు'' అన్నాడు. ఆ ధనవంతుడు విసుక్కుంటూ ఒక రొట్టెముక్క తెచ్చాడు. దానిని పేదవాడి మొహం మీదికి విసిరేస్తూ –

"ఇది తీసుకొని నరకానికి తగలడు" అన్నాడు.

ఆ పేదవాడు రొట్టెముక్క తీసుకొని నరకానికి వెళ్ళిపోయాడు. నరకం వీధి తలుపు ముందు ఒక ముసలి యమదూత కూర్చొని ఉన్నాడు. పేదవాడి చేతిలోని రొట్టెను రొట్టెను చూడగానే యమదూతకు నోరూరింది. ఆ రొట్టె తన కియ్యమని అడిగాడు. పాపం పేదవాడు మారుమాట్లాడకుండా ఇచ్చేశాడు. ఆ యమదూత పేదవాడికి ఒక మర (గిర్ని) ను ఇచ్చాడు.

"ఇది చాలా మహిమ గల మర. నువ్వు ఏది కోరుకుంటే అది ఇస్తుంది. మాట వరసకి నీకు అన్నం కావాలనుకో –!

మహిమ గల మరా, "నాకు అన్నం కావాలి. నా ఒక్కడికి అన్నం ఇయ్యి. తరవాత ఇంక ఆపెయ్యి."

అంటూ మెల్లగా గుసగుసలాడాలి. అయితే నీకు ఎంత కావాలో ఖచ్చితంగా చెప్పాలి. లేకపోతే చిక్కుల్లో పడతావు" అంటూ హెచ్చరించాడు యమ దూత.

కొద్దికాలంలోనే ఆ పేదవాడి ఇల్లు కలకలలాడ సాగింది. అతని ఇంట్లో దేనికీ కొదువ ఉండేది కాదు. ఒకనాడు అతని దగ్గరికి పొరుగింటి ధనవంతుడు వచ్చాడు.

'యాభై బంగారు నాణాలు ఇస్తాను. నీ మర నాకిచ్చెయ్" అన్నాడు. పేదవాడు మారుమాట లేకుండా ఇచ్చేశాడు. ఆ ధనవంతుడు మరను తీసుకొని పరుగులాంటి నడకతో ఇంటికి వచ్చాడు. అతనికి రొయ్యల పులుసంటే ప్రాణం. మరను బల్ల మీద పెట్టి –

"రొయ్యల పులుసు ఇవ్వు" అంటూ గొంతు చించుకొని అరిచాడు.

మరలోంచి రొయ్యల పులుసు రాసాగింది. కొద్దిసేపట్లోనే అతని ఇల్లంతా రొయ్యల పులుసుతో నిండిపోయింది. ధనవంతుడు 'ఆపు – ఆపు' అని అరుస్తున్నా ఆ మర ఆపలేదు. ధనవంతుడు పులుసులో మునిగిపోసాగాడు. ఎలాగో లాగా ఈదుకుంటూ బయటపడ్డాడు. పేదవాడి దగ్గరకు పరిగెత్తుకెళ్ళి –

"నీ మర నాకొద్దు. తీసేసుకో" అన్నాడు.

పేదవాడు మారు మాటాడకుండా తీసేసు కున్నాడు.

ఈ మర మహిమల గురించి ఊరూర పాకి పోయింది. ఒకసారి ఒక సముద్ర వ్యాపారి పేదవాడి దగ్గరకు వచ్చాడు. అతడు ఓడలలో దేశ దేశాలు తిరిగి ఉప్పు వ్యాపారం చేస్తాడు.

"ఈ మర ఉప్పు అడిగితే ఇస్తుందా?" అని అడిగాడు.

"ఎందుకివ్వదు. నిక్షేపంగా ఇస్తుంది" అన్నాడు పేదవాడు.

"అయితే వెయ్యి బంగారు నాణాలు ఇస్తాను. ఈ మర నాకియ్యి" అన్నాడు.

పేదవాడు మారు మాటాడకుండా ఇచ్చేశాడు. ఆ వ్యాపారి మరను తీసుకొని తన నౌకలోకి వెళ్ళి పోయాడు. నౌక నిండా ఉప్పు నింపుకుంటే బోలెడంత లాభం గడించవచ్చునని ఉబలాట పడ్డాడు. అతడు మరను చూసి –

"ఉప్పు తయారు చెయ్యి" అని గావుకేక పెట్టాడు.

మర తిరగసాగింది. ఓడంతా ఉప్పుతో నిండి పోతోంది. ఉప్పు బరువుకు ఓడ మెల్లగా మునిగి పోతోంది. వ్యాపారి ప్రాణభయంతో గజగజలాడి పోయాడు. 'ఆపు ఆపు అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. కానీ ఏం లాభం లేకపోయింది. చివరికి ఉప్పు బరువుకు ఓడ మునిగిపోయి, సముద్రం అడుగుకు చేరిపోయింది. అక్కడ ఆ మర ఇంకా తిరుగుతూనే ఉంది. ఎందుకంటే ఎంత ఉప్పు కావాలో దానికి ఆ వ్యాపారి మెల్లిగా చెప్పలేదు కదా! అందుకే సముద్రం నీరు ఉప్పగా ఉంటుంది. ఇది కట్టుకథ మాత్రమే! నిజమని నమ్మకండి! సముద్రం నీరు ఉప్పగా ఎందుకుంటుందో మీకు మీ మాస్టారు చెప్పే ఉంటారు. ఆయన చెప్పిందే నిజం.

–ఎస్. శ్రీనివాసరావు

(ఒక జానపద కథ ఆధారంగా)

**జోక్స్**

మాస్టారు: "క్రిష్ణా! నాక్కొమ్మిస్తే ఏమౌతుందిరా?"

క్రిష్ణ: అందర్నీ పొడిచేస్తుంది సార్!



# నేస్తం

'చెలిమి' అనే మాటకు అర్థం మీకు తెలుసునుగా! స్నేహం, దోస్తీ, మైత్రి అనే మాటలు కూడా అదే అర్థమిస్తాయి. స్నేహం అంటే ఒకరిపైన ఒకరికి ప్రేమ ఉండడం. ఎప్పుడూ కలిసి మెలిసి ఆడుకోవాలనీ, ఒకరికి కష్టం వస్తే మరొకరు సాయం చేయాలనీ అనుకోవడం – అది స్నేహం యొక్క అంతరార్థం.

అలాంటి గాఢ స్నేహితులను గురించి చిన్న కథ చెబుతాను. రమణ, రవి ఎంతో మంచి స్నేహితులు. ఇద్దరూ ఇరుగుపొరుగు ఇళ్ళల్లో ఉంటున్నారు. చిన్నప్పటి నుంచి ఒకే బడిలో చదువుకుంటున్నారు. కలిసి బడికి వెళ్ళి పక్కపక్కనే కూర్చునేవారు. ఇద్దరికీ మంచి మార్కులే వచ్చేవి.

ఒక రోజు బడి దగ్గర ఉన్న చెరువు గట్టున కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు. రమణా, రవీ బడికి వెళుతూ వాళ్ళని చూశారు.

'ఒరేయ్! చిన్న పిల్లలు నీళ్ళ దగ్గరికి వెడితే ప్రమాదం. వెళ్ళి పొమ్మని చెపుదాం" అని అన్నాడు రమణ రవితో.

"పోరా! మనకెందుకు. మనం చెపితే వాళ్ళు వింటారా? పద పద, బడికి వేళయి పోతూంది" అన్నాడు రవి.

సరే, వీళ్ళు నాలుగడుగులు వేశారో లేదో పిల్లలు గొల్లున గోల చేయడం వినిపించింది. ఎవరో చిన్న పిల్ల నీళ్ళలో కాలుజారి పడనే పడింది. రవి, రమణ వెనక్కి పరిగెత్తుకొచ్చారు. రవి చప్పున చొక్కా విప్పి నీళ్ళలో దూకాడు. నీళ్ళల్లో పడిన పిల్ల కాళ్ళు తేలిపోతుండగా చెరువులోకి జారిపోతూంది. రవి ఆ

పిల్ల గౌను పట్టుకుని ఒడ్డుకు లాక్కుని వచ్చాడు.

ఆ పాప భయంతో వణికిపోతూంది. పెద్ద వాళ్ళు కొందరు ఈ గొడవ విని గబగబా వచ్చారు. పిల్లని ఎత్తుకుని గట్టు మీద కూర్చో బెట్టారు. కళ్ళు తెరిచి దిక్కులు చూస్తున్నది. పాప తండ్రికి ఈ విషయం తెలిసింది.

ఆయన అక్కడికి వచ్చాడు. తన బిడ్డను రక్షించినందుకు రవిని మెచ్చుకున్నాడు. రవి అమ్మా నాన్న కూడా జరిగింది విని పాపకు, రవికి కూడా ప్రమాదం తప్పినందుకు సంతోషించారు.

ఇదంతా పూర్తయి బడికి కొంచెం ఆలస్యంగా చేరారు మిత్రులిద్దరూ. అప్పటికే రవి చేసిన సాహసకార్యం అందరికీ తెలిసి పోయింది. ఆ సాయంత్రం ప్రత్యేకంగా ఒక మీటింగ్ పెట్టారు. పాప తల్లిదండ్రులు రవికి బహుమతిగా నూరు రూపాయలు ఇచ్చారు. హెడ్మాస్టరు ప్రశంసా పత్రం బహూకరించారు. సభ పూర్తి అయ్యే సమయానికి రమణ తను కూడా ఒక్క నిముషం మాట్లాడతానని అనుమతి కోరాడు.

"పెద్దలందరికీ వందనాలు. రవి సాహస



వంతుడు. మంచివాడు. కానీ అవసరం అయినపుడు మాట్లాడడు. ముందు చూపులేదు. ఒక్క లోపం." అనేసి వెళ్ళి కూర్చున్నాడు. ఈ మాటలకు పిల్లలు పెద్దలు కూడా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. రవికి అంత గౌరవం జరిగినందుకు ఈర్ష్యతో ఇలా మాట్లాడాడు అనుకున్నారు. హెడ్మాస్టరు రమణని వేదిక మీదికి పిలిచి –

"అందరు రవిని మెచ్చుకుంటూ ఉంటే నువ్వు అనడం ఏమీ బాగుండలేదు రమణా! ఇందుకు ఏదో కారణం ఉండాలి. ఏమిటది?" అన్నారు. రమణ ఉదయం తామిద్దరు చెరువు దగ్గర నడుస్తున్నప్పుడు జరిగిన సంభాషణ చెప్పాడు.

"ముందుగానే ఆ పిల్లల్ని దూరంగా పంపి ఉంటే ఆ ప్రమాదం జరిగేది కాదు" అన్నాడు రమణ. సభలో ఉన్న వారందరు నిజమే అని అంగీకరించారు. పాప తండ్రి మాట్లాడటానికి లేచి నిలబడటంతో అందరూ నిశ్శబ్దమై పోయారు.

"రమణ, రవికి నిజమైన స్నేహితుడు. ఎందుకంటే అందరూ రవిని మెచ్చుకున్నాగానీ, మిత్రునిలోని లోపాన్ని చెప్పి సరిదిద్దుకోమని హెచ్చరించిన రమణ, రవి మేలుకోరిన వాడు. రవి ఇంకా పైకి రావాలన్న అభిమానంతో ఆ చిన్నలోపం కూడా లేకుండా ఉండాలని కోరుకుంటున్నాడు. మిత్రుడంటే ఎప్పుడూ ప్రేమగా ఉండేవాడు మాత్రమే కాదు. లోపాలను కూడా ఎత్తిచూపి మంచి మార్గం చూపేవాడు కూడా. అయితే రమణ తానైనా కనీసం ఆ పిల్లలను నీటి వద్దకు పోవద్దని చెప్పవలసింది. ఏది ఏమైనా పాపకి తప్పిన ప్రమాదానికి నాకు సంతోషంగా ఉంది. రవి, రమణల చెలిమి మరింత పెరగాలని ఆశీర్వదిస్తున్నాను అన్నారు. అందరూ చప్పట్లు కొట్టారు.

– తురగా జానకీరాణి

# మానవత్వం

అనగా అనగా ఒక గ్రామం. ఆ వూరులో ఒక చిన్న కుటుంబం ఉంది. అందులో ఒక ముసలవ్వ ఉంది. ఆ అవ్వ చేతులకు ఇప్పుడిప్పుడే స్పర్శలేకుండా అయింది. ఆమె మనుమడు శివుడు. ఒక రోజు అవ్వకు బాగా ఆకలి అయింది. ఆమె మంచంపైన ఉంది. పక్కనే అన్నం పెట్టిపోయాడు. కాని తీసుకోవడానికి రాదు. శివుణ్ణి పిలిచి అన్నం పెట్టు అని అడిగింది. వాడు “ఏ పో, నీవు ఎప్పుడు లొట్టి మీది కాకిలా నాకు తగులుతావు. నేను పెట్టనుపో” అనుకుంటు వెళ్ళుతుంటే అతని స్నేహితుడు రాముడు వచ్చాడు. “ఏందిరా” అని అడిగితే “ఏం లేదులే పోయి ఆడుకుందాం రారా” అని అంటే “ఏ ఆగురా” అని రాముడు అవ్వ దగ్గరకు వచ్చాడు. సంగతి తెలుసుకున్నాడు. అన్నం పెట్టి వెళ్ళాడు.



బయట ఆటస్థలంలో రాముడు శివునితో “అరేయ్ నీవు తినే అన్నం, నీవు ఉన్న ఇల్లు ఆమెదే, అది తెలుసుకో. ఈ రోజు నువ్వు ఇలా ఉన్నావంటే ఆవే కారణం. చిన్నప్పటి నుంచి నీకెంత సేవజేసిందిరా? అట్లాంటిది అవ్వ పని చెపితే వినవా? పని చేస్తున్నవని కాదు. అది ఒక అదృష్టంగా భావించాలి. పెద్దలకు సేవ చేయడం మన భాగ్యం అనుకోవాలి”. అని అన్నాడు. శివుని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అవ్వ దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్ళి, కాళ్ళ మీద పడ్డాడు. ఏడుస్తూ. “అవ్వ నేను ఇంకెప్పుడు అలా చెయ్యను. నన్ను క్షమించు, నీవు చెప్పిన పని చేస్తాను”. అని అన్నాడు. అవ్వ శివుణ్ణి ఓదారుస్తు “పోనిలే బిడ్డా, నీవు చిన్న పిల్లవాడివి నీకు ఏం తెలుసు అదేమి మనసులో పెట్టుకోకు నాయన” అన్నది. అప్పుడు పక్కన ఉన్న రాముడు “చూడురా శివుడు నీవు చేయకపోయినా, నీపైనే ప్రేమ చూపుతున్నది. మీ అవ్వకు పిల్లలంటే ఇష్టం” అని అన్నాడు. అప్పుడు శివుడు “అవునురా, నీవు నాకళ్ళు తెరిపించావు. ఒకటి తెలుసా! అవ్వ వాళ్లు దేవుళ్ళు. దేవుడు ఎక్కడో ఉండరు. అవ్వల రూపంలో ఉంటాడు. సరే ఆడుకుందాం రా” అంటూ పిలిచాడు. ఇద్దరూ వెళ్ళి ఆడుకున్నరు. అవ్వ మంచంపైన హాయిగా (సంతోషం)గా నిదురపోయింది.

**నీతి: పెద్దలను గౌరవించాలి. వారికి ఎదురు తిరగరాదు.**

– కె. మాధవి

# కప్ప గంతులు



పిల్లలందరూ 5, 6 మంది ఒక బ్యాచ్‌లో ఉండేలాగా 5 లేక 6 బ్యాచ్‌లు కావాలి. అంటే ఆ ఆటలో 25 మందికి పైగా ఉంటారు.

ఒక్కోబ్యాచ్ ఒక గీత మీద వరుసగా కూర్చొని కప్ప గెంతినట్లు గెంతుతూ ఎదురుగా దూరంగా ఉన్న గీత వద్దకు చేరుకోవాలి. బ్యాచ్‌లో అందరికంటే ముందుగా లక్ష్యం చేరుకొన్న వాడిని వేరు చేయాలి.



ఇలా అన్ని బ్యాచ్‌లు పూర్తి అయిన తర్వాత ప్రతి బ్యాచ్‌లోనూ మొదటి స్థానం పొందిన వారిని ఒక బ్యాచ్‌గా చేసి మళ్లీ వాళ్ల చేత ఆడించాలి. ఇపుడు మొదటి, రెండవ, మూడవ స్థానాలలో నిలిచిన వారు విజేతలు అవుతారు.

గెంతే దూరం పిల్లల వయస్సును బట్టి 20 అడుగుల వరకు ఉండవచ్చు.





అమ్మ
నాన్న
గురువు
స్నేహితుడు...
వీళ్లందరూ ఒకే సమయంలో ఉండే ఒకే చోటు
పుస్తకం
పుస్తకాన్ని ప్రేమిద్దాం...

## ఏప్రియల్ 2

## అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవ సందర్భంగా

**పిల్లలందరికీ జేజేలు – బాలచెలిమి**

# సాధించాలనే కోరిక



అనగనగా ఒక ఊరు ఉండేది. ఆ ఊరు పేరు చింతలపల్లి. ఈ ఊరిలో సుబ్బమ్మ, సోమయ్య అనే భార్యాభర్తలు ఉండేవారు. వీళ్ళు పంటలు పండించుకుని జీవనం సాగించేవారు. ఈ ఊళ్ళో ఏ పంటనైనా పండించి అమ్ముకుంటారు. ఊళ్ళో ప్రజలందరూ ఇతని దగ్గరికి వచ్చి పంటకి కావలసినంత డబ్బు ఇచ్చి పంటలను కొనేవారు.

ఈయనకి ఒక ఆడపిల్ల. తన పేరు నీలిమ. ఈ అమ్మాయిని చదుకోనివ్వరు. ఈ అమ్మాయికి చదువు అంటే చాలా ఇష్టం, ఇంట్లోనే పని చేసుకుంటు ఉంటుంది. 'అమ్మ నేను కూడా బడికి వెళ్ళి చదువుకుంట'. అంటే "నువ్వు చదువుకొని ఏమీ

ఉద్ధరిస్తావు నేను బడికి మాత్రం పంపించను" అంది అమ్మ. 'నాన్న నేను బడికి వెళ్తాను అమ్మ వద్దు అంటుంది' అంది నాన్నతో. అయినా ఆ ఊరి మాస్టార్ల సలహాలతో 9వ తరగతి దాకా చదివిస్తారు. ఆ తర్వాత మానివేయించి మూడేళ్ల గడిచిపోయింది. చదువు ప్రైవేటుగానైన కొనసాగిస్తానంటే ఒప్పుకోక బలవంతంగా 18 సంవత్సరాలు నిండక ముందే పెళ్లి చేస్తారు. నువ్వు బడికి వెళ్ళవలసినపనిలేదు. అని చెప్పారు. ఈమె భర్త చాలా మంచివాడు. తనకు ఏమి కావల్సిన తెచ్చి పెడతాడు. ఈయన



ఉపాధ్యాయునిగా పనిచేస్తాడు. ఈమెకు ఏ కష్టం రాకుండా చూసుకుంటాడు. ఈయన బడికి వెళ్ళగానే, నీలిమ టి.వి. చూసుకుంటూ ఉండేది.

ఒకరోజు ఆమెకి సందేహం కలిగింది. 'నేను టి.వి. చూసుకుంటూ ఉంటే నాకు ఏమి ప్రయోజనం! నేను కూడా ఏదైనా పని చేయవచ్చు కదా!' అని ఆలోచించింది.

తన భర్త బడికి వెళ్ళగానే, తను పెన్ను పేపర్ తీసుకుని కథలను రాయడం మొదలు పెట్టింది. తను చదువుకున్నది 9వ తరగతే అయినా, తను ఎంతో శ్రద్ధ పెట్టి ఎన్నో కథలను రాసింది. ఈమె భర్త పేరు మహేశ్. ఒకరోజు తను కథలను రాస్తుంటే చూసి, 'నువ్వు చదువుకోలేదు కదా ఏం రాస్తున్నావు?' అని ప్రశ్నించాడు. 'నేను రాసిన కథలు ఎలా ఉన్నాయో చదివి చెప్పు' అని తను రాసిన కథల పేపర్లును ఇచ్చింది. అప్పుడు మహేశ్ చదివి, 'నువ్వు రాసిన కథలు ఎంతో బాగున్నాయి' అని చెప్పాడు. అప్పుడు నీలిమ ఎంతో సంతోష పడింది. తను రాసిన కథలను అన్నింటిని మహేశ్ పాఠశాలకు తీసుకొని వెళ్ళి తరగతిలోని విద్యార్థులకు ఇచ్చి చదివి వినిపించే వాడు.

ఆ విద్యార్థులందరు ఆ కథలు విని ఎంతో సంతోషపడేవారు. ఈ కథలు చాలా బాగున్నాయి అని విద్యార్థులు మెచ్చుకున్నారు. వెంటనే మహేశ్ ఈ కథలను పేపర్‌లో వేయించాడు. తను రాసిన కథలు పేపర్ల పడ్డాయని ఎంతో సంతోష పడింది. కథల రచయిత్రిగా పేరు ప్రతిష్టలు పొందింది. ఇంత గొప్పదానిని అయినందుకు ఎంతగానో గర్వపడింది నీలిమ. 'తను ఇంత గొప్పది అయ్యింది నా కూతురు ఊళ్లో నా కూతురు ఎంతో గొప్ప పేరు సంపాదించు కుంది'. అని చాలా గర్వంగా భావించారు తల్లిదండ్రులు. పేపర్ల తను రాసిన కథలు పడితే ఊళ్లో ప్రజలు సోమయ్య నీ కూతురు కథ పేపర్ల పడింది అని చెప్పేవారు. తను ఇంక ఎక్కువ చదువుకుంటే ఇంకా గొప్ప కథా రచయిత్రి అయ్యి ఉండేది. తను అనుకున్న కోరిక సాధించింది. శ్రీశ్రద్ధ పెట్టి ఎన్నో కథలను రాసింది. ఈమె భర్త పేరు మహేశ్. ఒకరోజు తను కథలను రాస్తుంటే చూసి, 'నువ్వు చదువుకోలేదు కదా ఏం రాస్తున్నావు?' అని ప్రశ్నించాడు. 'నేను రాసిన కథలు ఎలా ఉన్నాయో చదివి చెప్పు' అని తను రాసిన కథల పేపర్లును ఇచ్చింది. అప్పుడు మహేశ్ చదివి, 'నువ్వు రాసిన కథలు ఎంతో బాగున్నాయి' అని చెప్పాడు. అప్పుడు నీలిమ ఎంతో సంతోష పడింది. తను రాసిన కథలను అన్నింటిని మహేశ్ పాఠశాలకు తీసుకొని వెళ్ళి తరగతిలోని విద్యార్థులకు ఇచ్చి చదివి వినిపించే వాడు.

ఆ విద్యార్థులందరు ఆ కథలు విని ఎంతో సంతోషపడేవారు. ఈ కథలు చాలా బాగున్నాయి అని విద్యార్థులు మెచ్చుకున్నారు. వెంటనే మహేశ్ ఈ కథలను పేపర్‌లో వేయించాడు. తను రాసిన కథలు పేపర్ల పడ్డాయని ఎంతో సంతోష పడింది. కథల రచయిత్రిగా పేరు ప్రతిష్టలు పొందింది. ఇంత గొప్పదానిని అయినందుకు ఎంతగానో గర్వపడింది నీలిమ. 'తను ఇంత గొప్పది అయ్యింది నాకూతురు ఊళ్లో నా కూతురు ఎంతో గొప్ప పేరు సంపాదించు కుంది'. అని చాలా గర్వంగా భావించారు తల్లిదండ్రులు. పేపర్ల తను రాసిన కథలు పడితే ఊళ్లో ప్రజలు సోమయ్య నీ కూతురు కథ పేపర్ల పడింది అని చెప్పేవారు. తను ఇంక ఎక్కువ చదువుకుంటే ఇంకా గొప్ప కథా రచయిత్రి అయ్యి ఉండేది. తను అనుకున్న కోరిక సాధించింది.

– వి. దుర్గాభవాని

# చిలిపి చిలుక



అరవిందాపురానికి చేరువలో ఒక అందమైన అడవి కలదు. ఆ అడవిలో చాలా చాలా గుబురు పొదలు, తరువులు (వృక్షాలు) లతలు, తీగలు కలవు. వాటిపై కాకులు, పావురాలు, చిలుకలు, కొంగలు కలిసి జీవనం గడుపుతుండేవి.

వీటిలో ఒక చిలుకల కుటుంబం ఉండేది. ఈ కుటుంబంలో ఓ చిలుక చాలా చాలా అందంగా ఉండేది. కానీ అందమైన మనసు కాదు. అందరితో కలిసి మెలిసి ఉండకుండా, చిలిపి పనులు చాలా చాలా చేసేది. తన వయసు గల చిలుకలను ఏదో

ఒకటి అంటూ ఏడిపించేది.

ఏ చిలుకైనా పండు తినడం చూసిందంటే చాలు, గబగబా పోయి గుంజుకుని తినేసేది. అలా తినకూడదని ఎవరైనా అంటే కోపంతో అరిచేది. అవి ఆటలు ఆడుకుంటూ వుంటే చాలు. గభాలున పోయి ఆటనంతా చిందరవందర చేసేది. ఇలా చేయకూడదని ఎవరైనా చెబితే నేనింతే నంటూ, వాటిని ఏడిపించేది. అరిచి గోల గోల చేసేది.

ఆ చిలుక ఆగడాలు రోజు రోజుకూ పెరగసాగాయి. శృతి మించిన చిలిపి పనులతో విసిగిపోయిన మిగతా చిలుకలకు ఏమి చేయాలో తోచలేదు. అవి బాగా ఆలోచించి చిలుక తాత గారి చెంతకు చేరాయి. చిలుక చేసే చిలిపి పనుల గురించి వివరంగా తెలిపాయి.

వారందరి మాటలను ఆలకించిన చిలుక తాత ఎలాగైనా చిలుక చిలిపి పనులను, కోపంగా అరవడం మానిపించాలని అనుకుంది. తాత చిలుక ఒక పథకం వేసింది. అందరినీ సహకరించాలని కోరింది. 'ఓ', అలాగేనని తలలు ఊపాయి చిలుకలు. ఈ రోజు నుండి చిలిపి చిలుకతో ఎవరూ మాట్లాడకూడదని, ఏది అడిగినా కాదనకూడదని, అందరూ మౌనంగా ఉండాలని కోరింది. అలాగే.. అలాగేనంటూ సంతోషంగా పలికాయి.

ఆ రోజు నుండి ఎవరూ చిలిపి చిలుకతో మాటామంతీ లేకుండా ఉండ సాగాయి. ఏదైనా అడిగితే అది అరిచి గోల చేయకముందే అందించాయి. ఇలా రెండు మూడు రోజులు గడిచాయి.

దీనితో ఆ చిలుకకు చిలిపి పనులు చేయడానికి, అరవడానికి అసలు అవకాశమే రాలేదు. రోజులు ఇలా గడిచిపోతుండటంతో ఆ చిలుకకు ఏమి తోచలేదు. ఎవరూ తనను పలకరించకపోయేసరికి ఒంటరితనంతో బాధపడింది. దాని మనసంతా చాలా దిగులుతో నిండిపోయింది. తాను చేసిన చిలిపి పనులు, అరవడం, గోల చేయడం, వాటిని పదే పదే విసిగించడం వలననే తనతో ఎవరూ మాటాడటం లేదని తనతో కలిసి మెలిసి ఉండటం లేదని తెలుసుకుంది. తన పొరపాటుకు చాలా బాధపడింది.

వెంటనే చిలుక తన తాత చిలుక చెంతకు పోయింది. "తాతా! తాతా! నేను ఇక ముందు ఇలాంటి పనులు చేయను. అందరితో మంచిగా ఆడుకుంటాను. వారికి నా విషయం తెలుపు తాతా!" అని దుఃఖపడుతూ అంటుంటే... చిలిపి చిలుక మంచి చిలుకగా మారినందుకు ఎంతో సంతోషపడింది తాత చిలుక. చేరువగా పిలిచి నేను మిగతా చిలుకలతో చెబుతాను. అంటూ తల నిమురుతూ ఇక ముందు ఇలాగే మంచిగా ఉండాలని దీవించింది.

ఆ రోజు నుండి చిలిపి చిలుక మంచి చిలుకగా మారిపోయింది. తోటి చిలుకలతో కలిసి మెలిసి ఆనందంగా ఆడుకోసాగింది. ఎవరికైనా ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే చిలుక పోయి సహాయం చేసేది. అందరికీ తలలో నాలుకలా మెలుగుతూ చలాకీగా, మంచి చిలుకగా చిలుకలందరి అభిమానం పొందింది.

– భోగోజు ఉపేందర్‌రావు



# జర భద్రం

పిల్లలూ మార్చి నుంచే ఎండలు మండిపోతున్నాయ్. ఇక ఏప్రియల్, మే నెలల్లో మరింత పెరుగుతాయి. తగు జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయి నీరస పడిపోతారు. ఒకోసారి తీవ్ర ప్రమాదాలు సంభవించవచ్చు. కనీసపు జాగ్రత్తలు పాటించి మనల్ని మనం కాపాడుకుందాం.

- ఎండలోకి వెళ్లేటప్పుడు గొడుగు తప్పని సరిగా వాడాలి.
- వదులైన తెల్లని లేదా లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి.
- నెత్తిపై టోపీ పెట్టుకోవాలి. లేదా రుమాలు, టవల్ చుట్టుకోవాలి.
- నీరు ఎక్కువగా తాగాలి. కొబ్బరి బోండాలు తాగుతుండాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ వాటర్ లేదా ఉప్పు, పంచదార కలిపిన నీరు తాగాలి.
- వడదెబ్బ తగిలిన లక్షణాలు కనిపిస్తే చల్లని నీటితో తడిపిన గుడ్డతో శరీరం తుడుస్తూ ఉండాలి. గాలి సోకేలా ఫ్యాను క్రింద పడుకోబెట్టాలి. ఉపశమనం కనిపించకపోతే డాక్టర్‌ని సంప్రదించాలి.



– బాలచెలిమి డెస్క్

# నేత్రదానం

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు రంగాపురం ఆ ఊరిలో ఒక పాఠశాల ఉంటుంది. ఆ పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉంటారు. వారికి ఇద్దరు గురువులు కూడా ఉండేవారు. 9వ తరగతిలో ఒక అబ్బాయి ఎప్పుడు పాఠశాలలో ప్రథమ స్థానంలో వచ్చేవాడు. ఒక గురువుకి ఆ అబ్బాయి అంటే ఎంతో ఇష్టం. ఆ అబ్బాయికి కూడా గురువు అంటే అంతే ఇష్టం.



ఒకరోజు ఆ అబ్బాయికి ప్రమాదంలో కళ్ళు పోవడంతో, వాళ్ళ అమ్మ నాన్న చాలా బాధపడతారు. చదువుకు ఆటంకం, ఉత్తమ విద్యార్థిని కోల్పోతున్నాం అనే బాధ గురువుకు కల్గింది. ఒక రోజు క్లాస్‌లో చూస్తే ఆ అబ్బాయి కనిపించడం లేదు. వెంటనే గురువు వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. ఆ అబ్బాయిని కలిసాడు. అబ్బాయి గురువును చూడగానే ఎంతో బాధ పడతాడు. ఆ అబ్బాయిని కలెక్టర్ చేయాలని గురువుగారికి కోరిక. గురువుగారు కంటి ఆస్పత్రి వారికి ఫోన్ చేసి వివరాలు కనుక్కొని హాస్పిటల్‌లో చేర్పించాడు. కళ్ళు ఇప్పించి కళ్లు వచ్చేలా చేసాడు.

'నేత్రదానం అనేది మరణించాక, నిర్ణీత సమయంలో వైద్యులు వచ్చి కంటికి సంబంధించిన అవయవాలను, ఆపరేషన్ చేసి తీసుకవెళ్లి ఐ బ్యాంక్‌లో భద్రపరుస్తారు. అవసరమైనప్పుడు, వాటిని వినియోగిస్తారు'. అంటూ నేత్ర దానం ఆవశ్యకత తెలియజేసారు ఆ గురువుగారు. వారి మాటతోనే రంగాపురంలోని వారందరూ నేత్రదాన అంగీకార పత్రాలు అందజేస్తారు. ఇలాంటి ఆపదలు ఎవరికైనా రావచ్చునని.

ఆ తరువాత అబ్బాయిని కలెక్టర్ అయ్యేలా తీర్చిదిద్దాడు. కొద్ది రోజులకు కలెక్టర్ అయ్యాడు. ఆ అబ్బాయి ఇలా అన్నాడు. "గురువులు విద్యార్థుల కోసం వాళ్ళ జీవితాలను కూడా త్యాగం చేస్తారు. ఎప్పుడూ వారు చెప్పిన మాటలను మనం పట్టించుకోము. ప్రపంచంలో గురువుల కన్న గొప్పవారు ఎవ్వరు ఉండరు. గురువుల త్యాగం వల్లనే విద్యార్థులందరు పై స్థాయికి ఎదుగుతారు, గురువులు లేని విద్యార్థులు ఎక్కడా ఉండరు. మన గురువులే మహా గొప్పవారు.

– కె. భవాని

# కష్టేఫలి




అనగనగా ఒక కొండ ప్రాంతం. అక్కడ ఒక చిన్న ఊరు కూడా ఉండేది. అయితే ఆ ఊరిని పరిపాలించే రాజు ముసలివాడు కావడంతో ఆ ఊరిలో ఉన్న ఏదో ఒక వ్యక్తిని రాజును చేయాలను కున్నాడు. ఎందుకంటే అతని సొంత కొడుకు దానికి అర్హుడు కాడు అని ఆయనకు తెలుసు.

అయితే, ఒకరోజు ఊరిలో ఉన్న ఐదుగురు తెలివైన, అలాగే శక్తివంతమైన యువకులను పిలిచాడు. వారికి ఒక పోటీ నిర్వహించాడు. ఆ పోటీ ఏమిటంటే, ఒక కొండ మీదికి వారు ఎంత వరకు ఎక్కుతారో ఎక్కి , వారు ఎంతవరకు చేరుకున్నా ఫర్వాలేదు. కాని వారు చేరుకున్న స్థలం నుండి ఏదైనా ఆనవాలుగా తీసుకు రావాలి, అని అంటాడు. అప్పుడు ఆ యువకులు ప్రయాణమవుతారు. ఇద్దరు యువకులు కొండ మధ్య దాకా వెళ్ళినట్టు చెట్టు కొమ్మలు తెచ్చి రాజుకు చూపెడతారు. మరో ఇద్దరు పువ్వులు తీసుకువచ్చి, మేమే దాదాపు కొండ చివరిదాకా వెళ్ళామని చెప్తారు. అలాగే ఆనవాలుగా పువ్వులు చూపెడతారు.

ఐదవ వ్యక్తి మాత్రం, చాలా సేపటికి తిరిగి వస్తాడు. కాని అతని చేతుల్లో ఏమీ ఉండదు. ఆ వ్యక్తి, 'నేను కొండ అంచుదాకా వెళ్ళాను. కాని దానికి సాక్ష్యంగా అక్కడ ఏమీ లేదు. కేవలం అక్కడ మంచు పడుతుంది' అని అంటాడు. అయితే నేను ఎలా నమ్మాలని రాజుగారు అడగడంతో, ఆ వ్యక్తి, కొండ చివరి దాకా ఎక్కడం వలన ఆయన కాళ్ళకు అయిన గాయాలను చూపిస్తాడు. అప్పుడు రాజు ఎంతో సంతోషంతో, ఆ వ్యక్తిని రాజుగా ప్రకటించడంతో, వేరే వారు కారణం అడగడంతో ఆ రాజు "మీరందరు, 'మేము ఇంకా పైకి వెళ్తే మాకు కష్టమౌతుందని' భయపడ్డారు. అక్కడికి వెళ్లడానికి ప్రయత్నించినట్లు కన్పడట్లేదు. కానీ, ఆయన ఒక్కడే శ్రమను నమ్ముకున్నాడు, పట్టుదలతో చివరిదాకా చేరాడు. విజయం పొందాడు అని చెప్పాడు.

– ఓ. శ్రేయ


# ముట్టుకోకుండా దారాన్ని కోయడం

చిన్న దారపుముక్కను గుండు సూదికి కట్టి, ఆ సూదిని ఒక జీలుగు బెండు బిరడా అడుగున గుచ్చు. ఆ బిరడా సరిగ్గా పట్టే మూతిగల పెద్దగాజు సీసాతెచ్చి, ఆ దారం ఆ సిసాలోపల వేలాడే లాగ బిరడా బిగించు. ఇప్పుడు మీ స్నేహితులను పిలిచి "ఈ సీసామూత తియ్యకుండా, లోపల ఉన్న దారాన్ని లోపల ఉండగానే రెండు ముక్కలుగా తెంపగలరా?" అని అడుగు.

అలా చేయడం అసాధ్యం అని అందరూ ఒప్పుకున్నాక, నువ్వు ఒక భూతద్దాన్ని తీసుకు వచ్చి, దాని సాయంతో సూర్యరశ్మిని సీసాలోని దారం మీద "ఫోకస్" చెయ్యి. తర్వలోనే సీసాలోని దారం కాలి, తెగి, ఒక ముక్క సీసాలోపల పడిపోతుంది. ఆ వేడికి సీసా పగల్లేదేమని చాలా మంది ఆశ్చర్యం పడతారు. దానికి కారణం ఉంది.

వెలుతురు కిరణాలు గాజులోంచి నిరాఘాటంగా ప్రయాణం చేయగలవు. మూసి ఉన్న గాజు కిటికీలో నుంచి శీతాకాలంలో సూర్యకాంతి లోపలికి వచ్చి వెచ్చగా శరీరానికి తగులుతూ ఉండడం మన కందరికీ అనుభవంలో ఉన్న విషయమే. అందుకనే సూర్య కిరణాలు గాజు సీసాలోనుంచి వెళ్లి లోపల వేలాడుతున్న దారానికి తగిలాయి. అయితే దారిలో ఉన్న సీసా వేడెక్కకుండా దూరాన ఉన్న దారం ఎందుకు కాలింది అనేది అసలు ప్రశ్న. దీనికి సమాధానం చెప్పేముందు కాంతి, ఉష్ణశక్తుల లక్షణాలను గురించి రెండు మాటలు చెప్పాలి.

సూర్యగోళం పైభాగాన 6000 డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రత ఉంది. భూమిమీద 30ళీ సెంట్రీగేడు ఉన్నదనుకుందాం. విమానంలో గాని, హైడ్రొజన్ బుడగలో గాని ఎక్కి పైపైకి వెడుతూ ఉంటే, సూర్యుడికి దగ్గరగా వెడుతూన్నట్లే కదా? అంటే ఉష్ణోగ్రత పెరగాలి కదా? కాని, భూమిని విడిచి పైకి వెళ్లిన కొద్దీ ఉష్ణోగ్రత



తగ్గిపోతూ ఉంటుంది. ఏమిటీ విచిత్రం?

రాయి, కర్ర, మట్టి, ఇనుమువంటి "అపారదర్శక" (Opaque) పదార్థాలకి తగలగానే వెలుగు వేడిగా మారుతుంది. గాలి, గాజు వంటి "పారదర్శక" (Transparent) పదార్థాలలోనుంచి కాంతి అడ్డులేకుండా ప్రయాణం చేస్తుంది. కాబట్టి ఇక్కడ కాంతి వేడిగా మారదు. సూర్యుడి నుంచి వచ్చే కాంతి దారిలో ఉన్న పారదర్శకమైన గాలిని వేడి చేయక, సరాసరి అపారదర్శకమైన నేలకి తగిలి వేడిగా మారుతుంది. నేల వేడెక్కుతుంది. వేడెక్కిన నేల దానిని ఆవరించి ఉన్న గాలిని వేడి చేస్తుంది. అందుకనే నేలకి దగ్గరలో వేడిగానూ, నేలను విడిచి పైపైకి వెళ్లిన కొద్దీ చల్లగానూ ఉంటుంది. ఈ కారణం వల్లనే ఎత్తైన కొండమీద చల్లగా ఉంటుంది.

మన గారడీలో సూర్యకాంతి పారదర్శకమైన సీసాని వేడి చేయక, అపారదర్శకమైన దారానికి తగిలి, అక్కడ వేడిగా మారి, దారాన్ని కాల్చింది. ఒకసారి వేడిగా మారిన తరవాత, ఆ వేడిమి గాజు సీసాలో నుంచి దూరి బయటకు జారుకోవడం తేలిక కాదు. వెలుగుకి పారదర్శకమైన గాజు, వేడికి అపారదర్శకమే!

ఇదే విధంగా గాజు సీసాలో ధాన్యపు గింజలు పోసి, సీసాపగలకుండా భూతద్దంతో వేడి చేసి, వాటిని పేలాలుగా మార్చవచ్చు!

– మహీధర నళినీమోహన్



# సముద్రాలూ కలుషితమవుతున్నాయి

అగ్ని పర్వతాలు బద్దలు కావటం, భూకంపాలు రావటం, సునామీ తీర ప్రాంతాలను ముంచెత్తటం వంటి ప్రకృతి ఉత్పాతాల గురించి మనం వింటూనే ఉన్నాం. మరి మనిషి చేసే పనుల వలన ఇంతే తీవ్రత ఉన్న ఎన్నో ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. సముద్రాల లోనికి మనం కావాలనో, ప్రమాద వశాత్తూనో చమురును వదలటం ఇటువంటిదే. సముద్రంలో చమురు తెట్టలు తెట్టలుగా పైన పేరులంటే మనకేమవుతుంది? అని అందరూ అనుకొంటూ ఉంటారు. కాని ఇది వాస్తవం కాదు. ఒక్కసారి చమురు సముద్రపు నీటిలోకి చేరితే అది నీటి పైన పొరలాగ వ్యాప్తి చెందుతుంది. గాలి వీచే దిక్కుకు అనుగుణంగా ఈ చమురు పొర కూడా విస్తరిస్తుంది. దాంతో పైనుంచి పడే కాంతి తగ్గిపోయి, నీటి లోపల ఉండే వృక్ష జాతులలో కిరణ జన్య సంయోగ క్రియ జరగటం తగ్గుతుంది. నీటిలో నివసించే జంతుజాతులలో శ్వాస సంబంధ సమస్యలు తలెత్తుతాయి. వాటి ఆహారం పైన ఈ చమురు పేరుకు ఉంటుంది కనుక వాటి జీర్ణ వ్యవస్థకూ ఇబ్బంది తప్పదు. జంతువుల శరీరంపైన చమురు పేరుకుని కొత్త సమస్యలను సృష్టిస్తుంది. అలాగే పక్షుల రెక్కలు, ఈకలలో నూనె చేరి అవి తగిన విధంగా ఎగరలేక పోతాయి. సముద్రం మధ్యలో పడిన చమురు అతి తక్కువ కాలంలోనే తీర ప్రాంతాలకు కొట్టుకువచ్చి తీర ప్రాంతాలూ కలుషితమవుతాయి.

భూమి మీద పడిన చమురు వాన నీటితో పాటు కొట్టుకు పోయి సముద్రాలలో కలవటం, భూమి పొరల్లోకి ఇంకి సముద్ర జలాల్లో కలవటం, సముద్రయానం ద్వారా చమురును ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలిస్తున్నప్పుడు ప్రమాదవశాత్తూ నీటిలో కలవటం వంటివి సముద్ర జలాల కాలుష్యానికి కారణంగా నిలుస్తున్నాయి.

ఒకసారి సముద్రం లోనికి చేరిన తర్వాత, దానిని శుభ్రపర్చటం ఎంతో కష్టం. కొన్ని రకాల రసాయనాలను ఉపయోగించటం, చమురును సముద్రం మధ్యలోనే తగలబెట్టటం, కలుషితమైన నీటిని సేకరించి ప్రత్యేక విధానాల ద్వారా వడబోయటం వంటి పద్ధతులు ఉన్నప్పటికీ, ఎంతో కొంత హాని మాత్రం అప్పటికి జరిగిపోయే ఉంటుంది.

– బాలచెలిమి డెస్క్

కథ

# మూఢ నమ్మకాలు



లక్ష్మీపురం అనే గ్రామంలో నర్సయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతనికి భార్య లక్ష్మి, బిడ్డ పద్మ ఉన్నారు. భార్య తనతోపాటు కైకిలి వ్యవసాయ పనులు చేస్తుండగా బిడ్డ పద్మ బడికి పోతుంది.

ఇది ఇలా ఉండగా, నర్సయ్య భార్య లక్ష్మికి ఆరోగ్యం క్షీణించడం మొదలుపెట్టింది, మంచం పట్టింది. చుట్టు పక్కల వాళ్లు లక్ష్మికి ఎవరో చేతబడి మంత్రాలు చేశారని, మరి కొందరేమో దేవుని కోడి ఉందని చెప్పారు. ఎవరికైనా శివసత్తులకు చూయించాలని మరికొందరు వల్లు పట్టించాలన్నారు. వారి మాటలు విని నర్సయ్య వల్లు పట్టే ఎల్లమ్మ దగ్గరికి వెళ్ళి వల్లు పట్టించగా, 'ఎల్లమ్మ కోడిరా ఎల్లమ్మ కోపంమీద ఉంది. పట్నం వేసి గొర్రెపిల్లను బలి ఇయ్యాలని' చెప్పింది. ఆరోగ్యం బాగైతదని చెప్పింది. అట్లనే శివసత్తి పోశమ్మ దగ్గరకి ఎల్లగా, శిగమూగుతూ 'దుర్గమ్మ కోడిరా దుర్గమ్మకు పండుగ జేస్తే ఆరోగ్యం బాగుపడుతుందిరా' అంటుంది. సరేనని తిరిగొస్తాడు.

నర్సయ్య బాధతో ఇంటికి వస్తుండగా, దారిలో ఉపాధ్యాయుడు రాజు కనబడి పలుకరిస్తాడు. ఏం నర్సయ్య మీ బిడ్డ పద్మ బడికి రావడం లేదు? "మంచిగా చదివే అమ్మాయి ఎందుకు పంపడంలేదు!" అని అడుగుతాడు. అప్పుడు నర్సయ్య తన పరిస్థితి బాగాలేదని, తన భార్య లక్ష్మి ఆరోగ్యం బాగాలేదని తెలుపుతూ, 'వల్లుపట్టిచ్చినా శివసత్తి దగ్గరికి పోయొస్తున్నా దేవుండ్లకు జెయ్యాలెనట' అంటాడు. ఉపాధ్యాయుడు రాజు, 'ఇంట్లో పనిచేస్తుంది. అందుకే రావడం లేదని చెప్తున్నావ్ అంతేనా? ఏమయ్యా నర్సయ్య, ఆరోగ్య విషయంలో దేవుండ్లు పడ్తరని ఎవరంటాయ్య అవి మూఢ నమ్మకాలు. దేవుడ్లు మీద భక్తి ఉంటే ఉండవచ్చు. కానీ అంత మూఢ నమ్మకాలు పనికి రావు. నువ్వు నీ భార్యని పట్నంల పెద్ద దవాఖానకు తీసుకపో, వాళ్లు అన్ని రకాల పరీక్షలు జేస్తరు. అసలైన రోగాన్ని దొరకబట్టి, వాటికి తగిన మందులిస్తరు తగ్గిపోతది. ముందు నువు దావఖాండ్లకుపో' అనగానే, సరే అంటూనే నర్సయ్య ఇంటికే వస్తాడు.

చుట్టుపక్కల అమ్మలక్కలు నర్సయ్య ఇంట్లో మూగుతారు. 'నర్సయ్య వల్లువట్టిచ్చినవా, ఏమని జెప్పింరు?' అనగానే, నర్సయ్య వల్లువట్టే ఎల్లమ్మ ఎల్లమ్మకోడి అని పట్నం వేయాలని చెప్పిందని, శివసత్తి పోశమ్మ దుర్గమ్మకు జేయాలని చెప్పిందనీ పండుగలు జేత్తెనే దేవతలు శాంతిస్తరని ఆరోగ్యం బాగుంటది అన్నారని అంటాడు. చేయాలే చేయాలే అని అమ్మలక్కలంటారు.

ఆర్.ఎమ్.పి. డాక్టర్ శ్రీను వస్తాడు. వచ్చి, 'ఏమయ్యా నర్సయ్య! లక్ష్మికెట్లా ఉంది?' అంటూనే చేయిపట్టి నాడీ చూస్తాడు. స్టెతస్కోప్‌తో గుండె కొట్టుకునుడు చూస్తాడు. 'లక్ష్మికి రోజు రోజుకు జ్వరం ఎక్కువవుతుంది. నేను రాసే మందులు కూడా పనిజేస్తలేవు. నువు వెంటనే పట్నంలో పెద్ద హాస్పిటల్‌కు తోలుకపో. అక్కడ పరీక్షలు జేసి మందులిస్తరు తగ్గుతుంది' అనగానే, అమ్మలక్కలు 'ఆ... ఏమి తగ్గుతుంది, ఎల్లమ్మ, దుర్గమ్మ పట్టిందట. పండుగలు జెయ్యాలె. నువు మందులు ఇయ్యనేవద్దిని, తగ్గకపోవునా అంటరు. ఆర్.ఎం.పి. శ్రీను, "అదిగాదు పెద్దమ్మ, చిన్నమ్మలు నేను చిన్న రోగాలకు మందులిస్తా తగ్గిపోతది గని, పెద్దరోగాలు గురించి నాకు తెలువది గదా, పట్నం ఎల్లితేనే మంచిది. లక్ష్మికి తల్లవ్వ అయింది. దానికీ తోడు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా అధికమయ్యాయి. తొందరగా పట్నం పోంద్రి లేకపోతే ప్రాణానికే ప్రమాదం" అని చెప్పి వెళ్లిపోతాడు. అమ్మలక్కలు, 'శ్రీను మత్తుగజెప్తడు. ఆయన మందులిత్త లేదా తగ్గకనేపాయె ఎల్లమ్మ, దుర్గమ్మకు జెయ్యి' అని ఎల్లిపోతారు.

నర్సయ్య, ఎల్లమ్మ పట్నం వెయ్యాలని బైండ్లోల్లను పిలిపిస్తాడు. దుర్గమ్మకు జెయ్యాలని దుబ్బులోల్లను పిలిపిస్తాడు. వేలకు వేలు పెట్టి గొర్రె, మేకలను కొనుకొస్తాడు. చుట్టాలను పిలుస్తాడు. లక్ష రూపాయలకు పైగా ఖర్చు పెడతాడు. అయినా జ్వరం తగ్గలేదు. కొందరు చుట్టాలు పెద్దదావఖాండ్లకు తీసుకపో అని సలహాలిస్తారు. దినం దినం రోగం ఎక్కువైతుంది. కాని తగ్గుత లేదు. లక్ష్మి నీళ్లు, ఆహారం ముట్టడంలేదు. ప్రాణాపాయస్థితిలోకి వెళ్లింది.

ఆర్.ఎం.పి. శ్రీనును పిలిపిస్తారు. "ఏమయ్యా నర్సయ్య! నేను చెప్పితిని గదయ్యా పండుగలు జెయ్య పోదువా ముందు పట్నం దవాఖానకు పొమ్మంటిని, నాతోని అయితలేదని జెప్తిని గీవల్లువట్టుడు, శివసత్తులు, మూఢనమ్మకాలతో అమ్మలక్కల మాటలు విని ప్రాణం మీదికి తెచ్చుకుంటివి. పండుగలతో లక్షలు ఖర్చుపెట్టివి. ఏమి మూఢ నమ్మకాలయ్యా? వెంటనే పట్నం దవాఖానకు తీసుకపో లేకపోతే నీభార్య లక్ష్మి నీకు దక్కదు" అనగానే, బండి మాట్లాడుకుని పట్నం దావఖాండ్లకు వెళ్లితే డాక్టరు లక్ష్మి ప్రాణాపాయస్థితిలో ఉందని, మేం పట్టనే పట్టము అంటారు. నర్సయ్య వాళ్ల కాళ్ల మీద పడి లబోదిబోమని ఏడుస్తూ బతిమి లాడుతాడు. 'ప్రయత్నం చేస్తాము ప్రాణం పోతే మా బాధ్యతలేదు. నీవు ఒప్పుకుంటే సంతకం జేస్తే చూస్తాము' అంటారు డాక్టర్లు. సరేనని సంతకం పెడుతాడు నర్సయ్య.

లక్ష్మికి అన్ని పరీక్షలు చేస్తారు, మందులిస్తారు, హాస్పిటల్‌లోనే కొన్ని రోజులుంటారు. లక్ష రూపాయల పైన దవాఖాన బిల్లు అవుతుంది. అతికష్టం మీద ఆమె ప్రాణాన్ని కాపాడుతారు డాక్టర్లు. ఎకరం పొలమమ్మి అప్పులు జేసి దవాఖాన బిల్లు కడుతాడు నర్సయ్య. తల్లికి తన బిడ్డ సేవలు జేస్తుంది.


లక్ష్మి ఆరోగ్యం బాగైన తర్వాత ఇంటికస్తారు. ఉపాధ్యాయుడు రాజు ఇంటికి వచ్చి, 'పద్మ హుషారు అమ్మాయి ఎందుకు బడికి రావడంలేదు మీరు పంపడం లేదని అడుగుతాడు. నర్సయ్య జరిగినది చెప్తాడు. ఉపాధ్యాయుడు రాజు నర్సయ్య! ఎంతపని జేసినవయ్య రెంటి చెడ్డరేవని పని అయిపాయె. మూఢ నమ్మకాలతో వల్లువట్టిచ్చి, శివసత్తిమాటలు విని పండుగలు జేసి లక్షలు ఖర్చు పెడితివి. అటు దావఖాండ్ల లక్షలు ఖర్చు పెడితివి. 'గోటితో పోయెదాన్ని గొడ్డలిదాకా తెచ్చు కుంటివి. నేను ముందే చిలుకకు చెప్పినట్టు చెప్పితిని గదా! మొదలే పది ఇరువై వేలతో ఖర్చు అయ్యేది మూఢ నమ్మకాలతో ప్రాణం మీదకు తెచ్చుకుంటివి. తిండిపెట్టె పొలమమ్ముకుంటివి, అప్పుల పాలైతివిగదా! సరే, ఇలాంటి పనులు మరెప్పుడు జెయ్యకు ధైర్యముతో వుండు. పద్మను బడికి పంపించు. నేను కూడా నీకు కొన్ని పైసలు సహాయము జేస్తా బాధపడకు అని ఓదార్చాడు.

– వాసరవేణి శ్రీవివేక్

# అమ్మమ్మ ఐడియా

రచన : **చొక్కాపు వెంకటరమణ**, బొమ్మలు : **టి. గంగాధర్**





నీ మాట నేనిక నమ్మను నాకు సబ్బు వద్దు. బహుమతి వద్దు ఫో!
ఈసారి బహుమతి లేకపోతే ఇంకెప్పుడు నా మాట నమ్మ వద్దులే సబ్బు తీసుకో!
బుజ్జిగాడిలో గొప్ప మార్పు వచ్చిందండి! రోజూ రెండు సార్లు స్నానం చేస్తున్నాడు మూడు సార్లు సబ్బుతో ముఖం కడుగుతున్నాడు నాకు శ్రమ తగ్గింది.
ఈ సబ్బు ఎంత మంచి వాసన వస్తుందో చూశారా! ఎన్నిసార్లు దీనితో స్నానం చేసినా హాయిగా ఉంటుంది తెలుసా!
మీ అమ్మ వీడి మీద ఏదో చిట్కా ప్రయోగించినట్లుంది.
నిజమేనండీ
మూడు రోజుల్లో సబ్బు బిళ్ళ పూర్తిగా అరిగిపోయింది దాని మధ్య ఒక ఉంగరం ఉంది. బుజ్జిగాడు పరుగున అమ్మమ్మ దగ్గరికి వచ్చాడు.
అమ్మమ్మా! ఈ సబ్బులో బహుమతి ఉంది. నీవు నిజమే చెప్పావు. ఇదిగో ఉంగరం నా వేలికి సరిగ్గా సరిపోయింది.
ఈ ఉంగరం మీద ఏదో వ్రాసి ఉంది చూశావా?
ఆరోగ్యం మహాభాగ్యం
“ఆరోగ్యం మహాభాగ్యం” తెలిసిందా బుజ్జీ! దీన్ని నీ వేలికి పెట్టుకో ఎప్పుడూ ఈ మాట గుర్తు పెట్టుకో.
రోజూ రెండు సార్లు స్నానం చేయటం అలవాటైన బుజ్జిగాడికి ఎప్పుడైన ఓ పూట స్నానం చేయక పోతే చిరాకుగా ఉండేది. అలా బుజ్జిగాడికి శుచి శుభ్రత అలవాటయ్యాయి.
రోజూ స్నానం చేయాలి వ్యాధులు పారద్రోలాలి అశుభ్రతే అనారోగ్యం ఆరోగ్యమే మహాభాగ్యం
సమాప్తం

# దురాశ



ఒక ఊరిలో రామయ్య, సీతమ్మ అనే దంపతులు ఉండేవారు. వారు అడవిలోని కట్టెలు కొట్టుకుని, అవి అమ్మగా వచ్చిన డబ్బుతో జీవించే వారు. ఒకరోజు వర్షం వలన రామయ్య కట్టెలు కొట్టడానికి వెళ్ళలేదు. ఆ పూట తినడానికి ఒకటే రొట్టె ఉన్నది. ఆ రొట్టెను తినడానికి ఇద్దరూ సగం సగం సరిపెట్టుకుందా మనుకుంటారు. ఇంతలో ఇంటిముందు ఆకలితో సాధువు కనిపించాడు. ఆయనను ఇంటిలోకి ఆహ్వానించి రొట్టెను ఇచ్చారు. వీరి వద్ద మరొక రొట్టె లేదని గ్రహించిన సాధువు "నాయనా! మీ కోసం చేసుకొన్న రొట్టెను నాకు పెట్టి, మీరు పస్తులుందాం అనుకున్నారు కదా! ఇకపై మీరు ఎప్పుడూ పస్తులుండవలసిన అవసరం లేదు. ఈ రొట్టెను ఎంతకాలం, ఎంతమంది తిన్నా ఇది అందరికీ సరిపోతుంది. ఈ రొట్టెను పరోపకారానికి మాత్రమే వాడాలి. మీ స్వార్థానికి, కాదు! అని చెప్పి, ఆ సాధువు ఆ దంపతులను ఆశీర్వదించి వెళ్ళాడు. ఆ రోజు నుండి ఆ దంపతులు అడవిలోని బాటసారుల కడుపు నింపడం మొదలుపెట్టారు. ఈ రొట్టెలను అమ్ముకుంటే, చాలా డబ్బులు వస్తాయని అనుకొని, ఒకరోజు వారు



చాలా రొట్టెలను బాటసారులకు అమ్మి, వారిచ్చిన డబ్బు తీసుకొని ఇంటికి వచ్చి చూస్తే డబ్బు లేదు. అంతేకాదు సాధువు ఆశీర్వదించి ఇచ్చిన రొట్టె కూడా మాయం అయ్యింది పరోపకారానికి కాకుండా స్వార్థానికి అమ్మినందు వల్లనే ఇలా జరిగిందని తెలుసుకుని, అప్పటి నుండి కష్టపడి పని చేయడం మొదలు పెట్టారు.

**నీతి : దురాశ దుఃఖానికి చేటు.**

– సర్వజ్ఞ



# ఇప్ప చెట్టు

భారత దేశంలోని గిరిజనులు దీనిని పవిత్రంగా భావిస్తారు. గిరిజనులు జరుపుకునే సంప్రదాయ వేడుకలు, సంబరాలు, పెళ్ళి సమయంలో ఇప్పపూల నుండి తయారు చేసిన సారాను త్రాగడం ఆచారంగా పాటిస్తారు. ఇప్పపూలను, ఊటబెల్లాన్ని చేర్చి, పులియబెట్టి సారాను వండుతారు.

## ప్రాంతీయ భాషలో ఉన్న పేర్లు :

తెలుగులో ఇప్ప, యప్ప అని, కన్నడంలో హిప్పె అని, మళయాలంలో ఇలుప అని, తమిళంలో ఇలి (ఇలుపక) అని, హిందీలో మౌవా అని, సంస్కృతంలో మధుక అని, ఇంగ్లీష్‌లో మధుకబట్టరు, హనీ ట్రీ పిలుస్తారు.

## లభించు చోటు :

మన దేశంలో జార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా ఉత్తరాంధ్రలోని అడవులలో (ఏజెన్సి ప్రాంతం) ఇప్ప విస్తారంగా వ్యాపించి ఉంది. పెరుగుచున్నవి. ఈ అడవులలో చెట్లు 1. మధుక ఇండిక, మరియు 2. మధుక లాంగి ఫోలియా జాతులకు చెందినవి. ఈ అడవులలో విస్తరించిన చెట్ల నుండి సమర్థవంతంగా సేకరించగల్గితే 5 లక్షల టన్నుల విత్తనాన్ని, అందులోంచి 1.8 లక్షల టన్నుల నూనెను ఉత్పత్తి చెయ్యవచ్చును. కాని సేకరణ ఆ స్థాయిలో జరగడం లేదు.

## ఇప్ప చెట్టు లక్షణాలు :

ఇప్ప చెట్టు బలంగా, పాదుకు చుట్టుప్రక్కల విస్తరించిన పటిష్టమైన వేర్లు, చేవ కలిగిన కాండం, కొమ్మలు కలిగి 16–20 మీటరుల ఎత్తు పెరుగుతుంది, కాండం బెరడు క్రింద మృదువు కాండం, లోపల చేరదీరిన భాగం ఉంటాయి. చేవ తీరిన కాండం ఎరువు రంగు కలిగిన బ్రౌన్ వర్ణంలో ఉంటుంది. చెట్టు బెరడు నిలువుగా పగుళ్ళు వుండి నలుపు–బూడిద రంగులో ఉంటుంది. కొమ్మలు విరివిగా కల్గి, కొమ్మల చివర ఆకులు (పత్రాలు) గుత్తులు గుత్తులుగా ఉంటాయి. పుష్పాలు కూడా కొమ్మలు చివర గుత్తులు గుత్తులుగా ఉంటాయి. పుష్పాలు కూడా కొమ్మలు చివర గుత్తులుగా పూస్తాయి. పత్రాల సైజు 6–9 × 13–23 సెం.మీ.

ఉంటుంది. సాగిన అండాకారంగా ఉండి, దళసరిగా ఉండి, త్రుంచినప్పుడు పాలవంటి చిక్కని జిగటగా ఉన్న ద్రవం స్రవించును. లేత ఆకులు పింకురంగులో ఉండి, అడుగు భాగంలో నూగు వంటిది ఉంటుంది. చెట్టు 8-15 సం.లకు బలిష్టంగా మారుతుంది. 60 సంవత్సరంల వరకు పుష్పించును. ఎండకాలం ముందు ఫిబ్రవరి - ఏప్రిల్ నెలలో ఆకురాల్చును. ఆ సమయంలోనే కస్తూరి వాసన కలిగిన పూలు పుష్పించడం మొదలవుతుంది. సాధారణంగా వాడిన పూలదళాలు ఉదయం రాలుతాయి. ఒక చెట్టు నుండి 100-150 కిలోల పూల రెక్కల దిగుబడి ఉంటుంది. ఇలా రాలివడిన పూలను సేకరించి నీడలో ఆరబెడతారు. పలధీకరణ తరువాత రెండు నెలలకు కాయలు పక్వానికి వస్తాయి. జూన్-జులై నాటికి కాయలు పూర్తిగా పండి, విత్తానాలవుతాయి. కాయ (పండు) అండాకారంలో చిన్నకాయలా ఉంటుంది. పండుపై లోపలి భాగంలో గుజ్జు, దాని దిగువన గింజ ఉంటాయి. ఒక చెట్టు నిండి ఏడాదికి 60-80 కిలోల విత్తనం పొందవచ్చును. పెద్ద చెట్లు అయితే 100 కేజీల వరకు విత్తనాలు పొందవచ్చును. విత్తనంలో 30-35% వరకు నూనె, 14-16% వరకు ప్రొటీనులు ఉంటాయి. విత్తనంలో రెండు పిక్కలు ఉండి, విత్తన బరువులో 70% ఉండును. పిక్కల సైజు 25×17.5 మి.మీ. ఉంటుంది. పిక్కలో నూనె శాతం 46-50% ఉంటుంది. పళ్ళు పక్వానికి వచ్చిన తరువాత రాలి క్రిందపడతాయి. అలా పడిన పళ్ళను అక్కడ నివసించు గిరిజనులు, అడవి జాతుల వారు, సమీప గ్రామీణులు సేకరించి, ట్రైబల్ కో-ఆపరేటివ్ సంస్థలకు లేదా వ్యాపారులకు అమ్ముతారు. విత్తన సేకరణ జూన్ నుండి ఆగస్టు వరకు కొనసాగుతుంది. పండి, రాలి క్రింద పడిన పళ్ళను అలాగే వదిలి వేస్తే తేమ తగినంతగా లభించినచో అవి మొలకెత్తుతాయి. అందుచే విత్తనాలు రాలిపడటం మొదలైన వెంటనే వాటిని సేకరించడం మొదలు పెడతారు. సేకరించిన వాళ్ల నుండి నూనె గింజలను వెంటనే వారము లోపుగా వేరు చేయాలి. కాయల నుండి వేరు చేసిన గింజలను కళ్ళంలో ఆరబెట్టి తేమ శాతం 6%కు వచ్చిన తరువాత గన్ని బస్తాలలో నిలువ చేస్తారు. గింజలలో 7-8% వరకు తేమ ఉంటే గింజలు మొలకెత్తే అవకాశం ఉంది. సరిగా జాగ్రత్తలు తీసుకొని ఒక సంవత్సరం వరకు నిల్వ వుంచవచ్చును. గిరిజనులకు ఉపాధి కల్పించే వుద్దేశ్యంతో ప్రభుత్వ సహకారంతో గిరిజన సహకార సంస్థల ద్వారా ఇప్పగింజలను సేకరిస్తున్నారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ ఆయిల్ సీడ్స్ అండ్ వెజిటబుల్ ఆయిల్ డెవలప్‌మెంట్ బోర్డ్' వారు చెట్ల నూనె గింజల ఉత్పత్తి పెంచుటకు, గింజల సేకరణకు పథకాలను అమలు చేస్తున్నారు.

## ఉపయోగాలు

- ఇప్ప పువ్వుల నుండి తీసిన నూనె వంట కోసం వాడతారు.
- దీనిలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ఇప్ప నూనెను చర్మరక్షణ తైలంగా, కీళ్ళనొప్పులకు మర్ధన నూనెగా వాడతారు.
- శుద్ధీకరించిన నూనెను వనస్పతి, సబ్బులు, కొవ్వొత్తులు, ఫ్యాటి ఆమ్లాలు ఉత్పత్తిలో వినియోగిస్తారు.
- గిరిజనులు పూలను ఆహారంగా కూడ వాడతారు.
- దేశవాళీ సారా తయారీలో ఇప్ప పూలను ఉపయోగిస్తారు. ఒక టన్ను ఇప్ప పూల నుండి 405 లీటర్ల సారా తయారగుతుంది.
- ఇప్ప చెట్టు కలపను ఇంటి తలుపులు, గుమ్మాలు, కిటికిలు, ఎడ్లబళ్ల చక్రాల తయారీలో ఉపయోగిస్తారు.

**- బాలచెలిమి డెస్క్**

# రాక్షసుడు



వింధ్య పర్వతాలకు ఎడంగా మహారణ్యాలు వుండేవి. ఆ అరణ్యాల్లో వున్న కొండగుహల్లో రాక్షసులు వుండే వారు. అందులో ఒక రాక్షసుడు ఒంటరి. వాడు బయటికి వెళ్లి క్రూరమృగాల్ని వేటాడి ఆహారంగా తీసుకునేవాడు. వాడికి మాయమంత్రాలు కూడా వచ్చు. ఒక రోజు ఆ రాక్షసుడు అదృశ్యరూపంలో తిరుగుతూ వుండగా, ఒక పూలతోటలో కొందరు అందమైన అమ్మాయిలు ఆడుకుంటూ కనిపించారు. అందులో ఒక అమ్మాయి ఎంతో అందంగా కనిపించింది. రాక్షసుడు ఆమెను చూసి ముచ్చట పడి, మంత్రం వేసి చిలుకగా మార్చి, చేతితో పట్టుకుని తన గుహకి తీసుకు పోయాడు. తక్కిన అమ్మాయిలు లబోదిబోమన్నారు. ఉన్నట్టుండి ఆ సుందరి మాయం కావడం వాళ్లకి అంతు పట్టక, పరుగెత్తారు రాణిగారి దగ్గరికి. ఇంతకీ ఆ అమ్మాయి రాకుమారి. చెలులతో ఉద్యాన వనంలో విహారానికి వచ్చింది. తన కుమార్తె కనిపించలేదని విన్న రాజు, రాణీ తల్లడిల్లిపోయి, భటుల్ని మూలమూలకీ పంపించారు. జాడ తెలియలేదు.

రాక్షసుడు చిలుక రూపంలో వున్న రాకుమారిని, గుహకి తీసుకురాగానే, రాకుమారిగా మార్చాడు. ఆమె ఒక్కసారి భయంతో అరిచి, సొమ్మసిల్లింది. రాక్షసుడు సేదదీర్చి "భయపడకమ్మా. నేను నిన్నేమి చెయ్యను. నిన్ను చూడగానే, నీలాంటి కూతురు నాకు వుంటే ఎంత బాగుండునో కదా అని ఇక్కడికి తెచ్చాను. నేను గుహలో వున్నంత



తీసుకు వెళ్లమని ప్రాధేయ పడింది. రాక్షసుడు ఒప్పుకోలేదు.

రాజుగారు ఎంతమందిని పంపి, తన కుమార్తె కోసం వెతికించినా ఆచూకీ దొరకలేదు. ఇక లాభం లేదని దేశదేశాలూ చాటింపు వేయించాడు. తన కుమార్తెను తీసుకొచ్చిన వాడికి, వాడు ఎవడైనా సరే రాకుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తానని, తన రాజ్యం లోని కొంత భాగం ఇస్తాననీ ప్రకటించాడు. అది విన్న యువకులు, వీరులూ అందరూ అరణ్యాల వేపు బయలుదేరారు.

శివుడు అనేవాడు గిరిజనుడు. కొండ ప్రాంతాల్లో వుంటాడు. తెలివైన వాడు, ధైర్యవంతుడూ. వాడికి అడవుల్లో రాక్షసులన్నారనీ, వాళ్ళల్లో ఎవరైనా రాకుమారిని చెరబట్టి వుండవచ్చుననీ ఆ ప్రాంతం అంతా తిరగడం ఆరంభించాడు. ఒకరోజు వాడికి, మంచి తినుబండారాలు, పళ్లూ తీసుకెళుతూ రాక్షసుడు కనిపించాడు. శివుడు వాడిని అనుకరించాడు. వాడు గుహ లోకి వెళ్లగానే తానూ రహస్యంగా

సేపూ నువ్వు నీ అసలు రూపంలో వుంటావు. నీకు కావలసిన ఆహారం, సౌకర్యాలూ నేను చేకూరుస్తాను. నేను బయటికి వెళితే, నిన్ను చిలుకగా మార్చి పంజరంలో బంధిస్తాను. భయపడకు" అన్నాడు రాక్షసుడు. రాకుమారి ఏడుస్తూ తనని తన రాజ్యానికి

లోపల దూరి మూల నక్కాడు ధైర్యంగా. చిలుక రూపంలో వున్న రాకుమారిని లేపి తను తెచ్చిన పళ్లు అవీ తినమన్నాడు. "నాకేమీ వద్దు, నన్ను మా అమ్మ నాన్నల దగ్గరికి పంపు" అంది. "పంపు తానమ్మ. నువ్వు మీ అమ్మా నాన్నలకెంతో, నాకూ

అంతే. ఇవి తిను. సుకుమారివి. నిన్ను ప్రేమగా చూసుకోవాలనే తీసుకొచ్చాను. కొంతకాలం పాటు ఇక్కడనే ఉండు ఆ తర్వాత పంపేస్తాను. నన్ను నమ్ము" అని ధైర్యం చెప్పి తను తెచ్చినవి తినిపించాడు. అవి తింటూవుంటే పక్కన కూచుని ఆనందించాడు. శివుడు ఇదంతా చూస్తున్నాడు. వాడికి అర్థమైంది. చాలాసేపు ఆ మూలనే నక్కి వున్నాడు. రాక్షసుడు బయటికి వెళ్లబోతూ, రాకుమార్తెను చిలుకని చేసి పంజరంలో కూచోబెట్టాడు. రాక్షసుడు వెళ్లగానే శివుడు చిలుక దగ్గరకొచ్చి, 'నాపేరు శివుడు. నువ్వు మనిషి భాషలో మాట్లాడగలవా?" అని అడిగాడు. చిలుక ఆశ్చర్యపోయి. శివుడితో మాట్లాడింది. శివుడు విషయాలన్నీ చెప్పాడు. "చిలుకగా వున్న నన్ను తీసుకెళ్తే ప్రయోజనం వుండదు. నేను రాకుమారి రూపంలో వుండగా, నువ్వు ఏదైనా సాహసం చేసి, రాక్షసుడికి తెలియకుండా తీసుకెళ్లాలి. ఆలోచించు. జాగ్రత్త సుమా! వాడు రాక్షసుడు. నిన్ను చూశాడంటే మాత్రం చంపేస్తాడు" అని హెచ్చరించింది చిలుక. శివుడు ఆ గుహలోనే ఒక మూల పొంచి వున్నాడు అవకాశం కోసం. రాత్రంతా తిరిగి వచ్చి, నిద్రపోయి లేచిన రాక్షసుడు, చిలుకను రాకుమారిగా మార్చి, ఆనందంగా ప్రేమగా నవ్వాడు. "నేను నిన్ను ఎంతో ప్రేమగా చూస్తున్నాను. నువ్వు మాత్రం నీ విచారాన్ని వదలడం లేదు. నాన్నా అనో, పెద్ద నాన్నా అనో ఒక్కసారి నన్ను పిలిస్తే ఎంతో సంతోషిస్తాను"

రాకుమార్తె మనసులో 'ఛీ' అనుకున్నా – 'తండ్రీ' అంది గోముగా. రాక్షసుడు మురిసిపోయాడు. ఇంకో రెండుసార్లు పిలిపించుకున్నాడు. "ఇపుడు నేను హాయిగా నిద్రపోతాను." అని ఆనందంగా నిద్రపోయాడు. సందర్భం చూసి, శివుడు రాకుమార్తెను సమీపించి "రా పోదాం" అన్నాడు నెమ్మదిగా. రాకుమారి అతని చెయ్యి పట్టుకుని చప్పుడు కాకుండా నడిచింది. నాలుగు అడుగులు వేశారో లేదో "ఆగండి" అని రాక్షసుడు పెద్దగా అరిచి, లేచాడు. "ఎవడివిరా నువ్వు? ఎలా నా గుహలోకి ప్రవేశించావు? ఎంత సాహసంరా నీకు?" అని గద్దించాడు. శివుడు భయపడలేదు. రాజుగారు ప్రకటించిన ప్రకారం తాను వెతుకుతూ వచ్చాననీ, రాకుమార్తెని విడిచి పెట్టమని, తల్లిదండ్రులు నిద్రహారాలు లేక విలపిస్తున్నారనీ చెప్పాడు. "కావాలంటే నన్ను బంధించు. కొడుకులాగా చూసుకో. రాకుమార్తెను విడిచి పెట్టు" అన్నాడు శివుడు.

"భళా! ఈ సుకుమారికి తగ్గ వాడివి దొరికావు. నా కుమార్తెగా భావించు కుంటున్న ఈ సుందరికి సాహస వంతుడైన ధీరుడికిచ్చి వివాహం చెయ్యాలనుకున్నాను. నేను రాక్షసుడినే కాని, ఇలాంటి సుకుమారికి, మంచి భర్త దొరకాలని మనసులో కోరుకున్నాను. ప్రాణాలకి తెగించి, నువ్వు వచ్చావు. తీసుకెళ్లు. తీసుకెళ్లి రాజుగారికి అప్పగించు. అన్నమాట ప్రకారం రాజు, ఈ సుకుమారిని నీకే ఇచ్చి వివాహం చేస్తాడు. ఐతే ఒకమాట! నా కూతురు నా కళ్లెదుటనే వుండాలి. మీ వివాహం అయాక, నా గుహ పక్కనే, దివ్యమైన భవనం నిర్మిస్తాను. అందులో మీరు వుండాలి. నాకు కనిపిస్తూ వుండాలి" అన్నాడు రాక్షసుడు. ఇద్దరూ అలాగే అన్నారు ఆనందంగా. అంతకంటే ఆనందంగా రాక్షసుడు వాళ్లిద్దర్నీ భుజాల మీద ఎక్కించుకుని, పూదోటలో విడిచిపెట్టాడు.

– రావి కొండలరావు

# నిద్ర ఖరీదు

నిద్రావస్థలో ఉన్న ఓ చిన్న పావురానికి మెలకువ వచ్చింది. కళ్ళను నులుముకుంటూ "అమ్మా! అమ్మా! ఆకలి... ఆకలి..." అని అవరసాగింది.

అప్పుడు ఎదురుగా తన అక్క పావురం కొమ్మ మీద ఎదురుగా గూటి దగ్గరనే ఉన్నది. ఆ పావురం నోటికి ఆహారం అందించింది. అది తిని ఎప్పుడు నిద్ర నుండి లేవగానే అమ్మ అన్నం ముద్దన్నం పెట్టేది. ఇప్పుడేంటి అక్క చేతులో వుంది అని నిద్ర నుండి మేల్కొని కళ్ళు తెరచి చూసేసరికి ఎప్పుడూ చూడని ప్రదేశం కొత్త కొత్తగా అనిపించింది. తను ఉన్నది తమ గూడు కాదని అమ్మ కనబడుట లేదని తెలిసి "అక్కా! ఏది అమ్మ? ఇక్కడెందుకున్నాం?" అని ఏడుస్తూ చిన్న పావురం మారం చేసింది.

"అమ్మా... అమ్మా... అని అమ్మా కావాలి నాకు అమ్మ కావాలి" అని ఏడవసాగింది. అమ్మ రేపు వస్తుంది, మాపొస్తుంది అని చెప్పుకుంటూ అక్క పావురం రోజులు గడపసాగింది.

ఒకరోజు గట్టిగా అమ్మకావాలి అని చిన్న పావురం అక్క పావురంతో గొడవకు దిగింది. అప్పుడు అక్క పావురం చిన్న పావురానికి "నీవే అమ్మను చంపేసావు. నీవే అమ్మను చంపేసావు." అనగానే బిత్తరపోయిన చిన్న పావురం "నేను అమ్మను చంపటం ఏమిటి?" అని గట్టిగా అరవసాగింది.

అప్పుడు అసలు నిజాన్ని అక్క పావురం ఇలా చెప్పింది. "నీ నిద్రపోతుతనం వల్ల అమ్మ చనిపోయిందని" చెప్పింది.

"నీవు మన గూటిలో నిద్రిస్తున్నప్పుడు రెండు చెట్ల రాపిడితో అడవికి నిప్పంటుకుంది.



అప్పుడు మన గూటికి కూడా నిప్పంటుకుంది. ఆ గూటిలో నీవు నిద్రిస్తున్నావు. అప్పుడు అమ్మ నిన్ను ఎంత నిద్రలేపిన నీవు నిద్ర లేవలేదు. అప్పుడు అమ్మ తన కాళ్ళతో పట్టుకొని కడుపున దాచుకుంటూ ఎత్తుకొని గూటి నుండి బయటకు వచ్చేసరికి అప్పటికే అమ్మ రెక్కలకు నిప్పంటుకుంది. అయినా నీవు నిద్ర మేలుకోలేదు. అమ్మ నిప్పంటుకున్న రెక్కలతోనే నిన్ను వదలకుండా, కిందపడకుండా ఈ గూటికి చేర్చి, నీ చెల్లి జాగ్రత్తా! అని చెప్పి అక్కయినా, తల్లయిన అన్ని నీవేనని చెప్పి నిన్ను నా వడికి చేర్చి చనిపోయింది."

అని చెప్పగానే చిన్న పావురం భోరున ఏడుస్తూ అక్క కాళ్ళపై పడి నా సోమరితనం, నిద్రబోతుతనం వల్ల నా తల్లి ప్రాణం మూల్యంగా చెల్లించిందని ఏడుస్తూ ఇకపై నిద్రబోతుతనంగా ఉండనని అక్కతో కలిసి ఆహారం సంపాదించుకుంటూ బతకసాగింది.

నీతి : సోమరితనం, నిద్రబోతుతనం వల్ల ఆపదలొస్తాయి. నష్టాలు జరుగుతాయి.

– మల్లెల సాహిత్య

# కుక్క-దొంగ



ఒక దొంగ అర్ధరాత్రి వేళ దొంగతనానికి బయలు దేరాడు. అతడు మెల్లిమెల్లిగా ఒక ఇంటి గోడదూకి ముందుకు అడుగు వేశాడు. దొంగ అడుగుల చప్పుడు ఆ ఇంటిని కాపాలా కాస్తున్న కుక్క పసిగట్టింది. అంతే.. మొరగడం మొదలెట్టింది. కుక్క, గొలుసుతో కట్టేసి ఉండటం వల్ల దొంగను కరవలేదు. 'హమ్మయ్య ఇంకా నయం. ఇది గొలుసుతో కట్టి ఉంది. ఇది ఇలాగే మొరిగితే నేను పట్టుపడటం ఖాయం. ముందు దీన్ని మొరగకుండా చెయ్యాలి" అనుకుని సంచీలో నుంచి ఒక రొట్టె ముక్క తీసి, కుక్క దగ్గర పెట్టాడు. కాని కుక్క దానిని ముట్టుకో లేదు. మళ్ళీ మొరగడం ప్రారంభించింది. దొంగ దానిని బుజ్జగించేందుకు దాని దగ్గరికి వచ్చాడు. అంతే. కుక్క దొంగ కాలుని కరిచింది. దొంగకు విపరీతమైన కోపం వచ్చింది. "నన్నెందుకు కరిచావ్?" నీకు ఒక రొట్టెముక్క కూడా ఇచ్చాను కదా?" అన్నాడు.

వెంటనే కుక్క "నేను నిన్ను ఎందుకు కరిచానంటే – నువ్వు నాకు రొట్టెముక్క ఇవ్వకముందు నువ్వు మంచి వాడివో, చెడ్డవాడివో నాకు తెలియదు. కాని ఇప్పుడు తెలుసుకున్నాను – నువ్వు చెడ్డ వాడివనీ, నాకు రొట్టెముక్క ఇచ్చి నన్ను ఏమార్చాలనీ చూస్తు న్నావనీ. అందుకే నిన్ను కరిచాను" అంది కుక్క.

(లియో టాల్‌స్టాయ్ కథ ఆధారంగా)

# జిహ్వా చాపల్యం

వెంకటాపురం గ్రామంలో వెంకటేశం, ధనలక్ష్మి దంపతులు ఉండేవారు. వారిది అన్యోన్య దాంపత్యం. వారికి చంద్ర ఏకైక కుమారుడు. ఇతను ఏడో తరగతి చదువుతున్నాడు. వీరితో పాటు వెంకటేశం తల్లి పార్వతమ్మ కూడా ఉండేది. చంద్రకి నాయనమ్మ పార్వతమ్మ అంటే మహా ఇష్టం. తల్లి ధనలక్ష్మి మాటే అప్పుడప్పుడు లెక్క చేసేవాడు కాదు. ఇక వెంకటేశం ఒక చిన్న కంపెనీలో ఉద్యోగం చేస్తూ సంసార సాగరాన్ని ఈదుతున్నాడు. ఇతని భార్య ధనలక్ష్మి పేరు లోనే ధనం కాని ఇంట్లో ఎప్పుడూ ఈగలమోతే అని బాధపడేది. అయినా ఉన్నంతలో గుట్టుగా సంసారాన్ని లాక్కొచ్చేది. ఈమె అత్తగారు కోడలికి ఇంటి పనుల్లో మచ్చుకైనా సాయపడేది కాదు. పార్వతమ్మ రోగాల పుట్ట. పార్వతమ్మకు చక్కెర వ్యాధి. అది చాలదంటూ బీపీ. వీటికి తోడు ఆయాసం. అయినా ముసలావిడ పార్వతమ్మకు ఇవన్నీ ఉన్నాయనే స్పృహ ఉండేదే కాదు. పైగా జిహ్వా చాపల్యం. ఏది కనపడితే అది నోట్లో వేసుకుందామనే ధ్యాసే కాని ఆరోగ్యం గురించి ఆలోచించదు. కొడుకు వెంకటేశం ఉన్నాడుగా మాత్రలు తెస్తాడులే అనే వైఖరి. కోడలు ధనలక్ష్మి మంచి చెడు బాగా తెలిసిన ఇల్లాలు కావడంతో అత్తగారిని చక్కగా చూసుకుంటూనే ఆమె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేది. చక్కెర పదార్థాలను, మసాలా సంబంధిత ఆహారాలను అత్తగారికి పెట్టేది కాదు. ఎప్పుడో కాస్త పెట్టిన, మాత్రలు సమయానికి ఇస్తూ జాగ్రత్త పడేది.

ఇదిలా ఉండగా ఒకరోజు చంద్ర వాళ్ళ మామయ్య వచ్చాడు. చంద్ర కోసం మామిడి పళ్ళు తెచ్చాడు. పార్వతమ్మ కంట్లో పడ్డాయి ఈ మామిడి పండ్లు. కోడలు ధనలక్ష్మి మామిడి పండ్లుపెడితే అత్తగారికి శరీరంలో చక్కర పెరుగుతుందని దాచిపెట్టింది. చంద్ర మామిడిపండు తింటుంటే పార్వతమ్మ కళ్లన్నీ దానిపైనే. చంద్రా ఏమో, అమ్మ నాయనమ్మకు పండ్లు ఇవ్వటం లేదని అపార్థం చేసుకున్నాడు. మామయ్య పనులున్నాయంటూ వెంటనే వెళ్ళిపోయాడు. ధనలక్ష్మి ఇంట్లో సరుకులు నిండుకోవడంతో బజారుకు వెళ్ళొస్తానని చంద్రకి, అత్తగారికి చెప్పి వెళ్ళింది. ఇహ అంతే.. దొరికింది చాన్స్ అన్నట్లుగా పార్వతమ్మ చంద్రని పిలిచి మామిడిపండు తెచ్చి ఇయ్యమని అడిగింది. ఒక్క ఉదుటున వెళ్లి చంద్ర రెండు పెద్ద పెద్ద మామిడి పండ్లు తెచ్చి నాయనమ్మకిచ్చాడు. పార్వతమ్మ రెండు పండ్లు గబగబా తినేసి కోడలు ధనలక్ష్మి వచ్చేసరికి



మెల్లకుండా ఉంది. చంద్రకూడా తల్లికి ఈ విషయం చెప్పలేదు. ధనలక్ష్మి తన పనుల్లో తాను లీనమయ్యింది. రాత్రి కావడంతో అందరూ భోజనాలు చేసి పడుకున్నారు. అంతే.. ఇంచుమించు సమయం 11.30 అయ్యేసరికి పార్వతమ్మ గదిలోంచి మూలుగుడు చప్పుడు. ఒక్కసారిగా వెంకటేశం, ధనలక్ష్మి లేచి చూసారు. పార్వతమ్మకి ముఖం ఉబ్బింది. సోయి లేదు. వెంటనే భయం భయంగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇంకేముంది చక్కెర శాతం బాగా పెరిగి పోయిందని, గుండెకు శ్వాస సరిగా అందటం లేదని, వెంటిలేటర్ పెట్టాలి అంటూ టెస్టులు చేసి డాక్టర్ చెప్పడం నిమిషాల్లో జరిగి పోయాయి. డాక్టర్ పార్వతమ్మ ఏం తిన్నది ఎందుకు ఇలా ఆకస్మాత్తుగా చక్కర పెరిగిపోయింది అని ఆరా తీయడం.. వెంకటేశం భార్య ధనలక్ష్మిని నిలదీయటం ఒకదానివెంట ఒకటి జరిగిపోతున్నాయి. ధనలక్ష్మి నాకేం తెలియదు నేను ఆహార నియమాల్లో ఎటువంటి పొరపాటు చేయలేదు అనడంతో కాసేపు వాతావరణం అంతా అయోమయం అయింది. ఇంతలో చిన్నగా చంద్ర ఏడ్చుకుంటూ నాయనమ్మకు ఏమవుతుంతో అని తల్లి ధనలక్ష్మి దగ్గరకు వెళ్లి మామిడి పండ్ల ముచ్చటంతా చెప్పాడు. అమ్మా, ఇట్లయితది అనుకోలే అంటూ ఏడవటం మొదలెట్టాడు. ఐ.సి.యూలో పార్వతమ్మ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. మొత్తానికి మూడు రోజులు గడిచాయి పార్వతమ్మ ప్రాణం నిలబడింది. పార్వతమ్మకి సేవలు చేయలేక ధనలక్ష్మి, డబ్బులు ఎక్కడ అప్పు చేయాలో అర్థం కాక వెంకటేశం.. దీనికి తోడు పార్వతమ్మని పలకరించడానికి వచ్చిపోయే చుట్టాల మోత... సరిపోయింది దంపతులు ఇద్దరికీ. ఆసుపత్రి బిల్లు డెబ్బైవేలు. నానా తంటాలు పడి బిల్లు కట్టాడు వెంకటేశం. ధనలక్ష్మి చంద్రని తిట్టటం.. ఈ సారన్నా నిన్ను మంచి స్కూల్లో వేద్దాం అనుకున్నా అంతాపాడు చేసావు కదరా అంటూ దిగాలు పడుతున్న ధనలక్ష్మితో చంద్ర పశ్చాత్తాపం ప్రకటిస్తూ ఇంక ఎప్పుడూ ఇలాంటి పనులు చేయనని అమ్మ మాట గౌరవిస్తానని... హామీ ఇవ్వడం, పార్వతమ్మ కూడా కొడుకు కోడలు తన కోసం పడ్డ బాధలు చూసి తన జిహ్వ చాపల్యం తగ్గించుకుంటానని కోడలు పెట్టిందే తింటానని ఇంటికి పెద్దదిక్కుగా మసలు కుంటానని మాట ఇవ్వడంతో నలుగురూ సంతోషంగా ఇంటికి వెళ్లిపోయారు.

**– ఉప్పల పద్మ**


చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.


**మా చిరునామా :**
BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# ధాం... ధాం...

– డా॥ ఎం. హరికిషన్



కాకీ కాకీ రావా,
కాటుక కొంచం తేవా!

పిచుకా పిచుకా రావా,
రంగుల టోపీ తేవా!

బాతూ బాతూ రావా,
బంతీపూలు తేవా!

చిలకా చిలకా రావా,
జామాపండు తేవా!

గబగబ మీరు రాకుంటే,
అడిగినవంతా ఈకుంటే,

మా తాత తుపాకీతో –
ధాం... ధాం... ధాం...!



## పిల్లలూ...

- బొమ్మలు గీసి పంపండి.
- ఫొటోలు తీసి పంపండి.
- కథలు, కవితలు, గేయాలు రాసి పంపండి.
- మీకు నచ్చిన పుస్తకం గురించి రాయండి.
- మీకు నచ్చిన ఆట గురించి రాయండి.
- మీకు తెలిసిన సామెతలు, పొడుపు కథలు, జోక్స్ పంపండి.
- కార్టూన్లు గీస్తారా... అవి కూడా పంపండి.

వీటితో పాటు మీ ఫొటో, చిరునామా మరవకండి...

**BALA CHELIMI**

"CHANDRAM" 3-6-712/2, St.No.12, Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com, Mob: 98480 44713

# అబద్ధం

ఏమండోయ్... అమ్మాయిని ఎంత లేపినా లేవటం లేదు. ఏదో కడుపునొప్పి అంటోంది. స్కూలుకు పంపేదుందా లేదా? ఓసారి చూడండి" వంటింట్లోంచే కాస్త గట్టిగా అరిచి చెప్పింది శ్రీజ. స్కూలు సంగతి కాదుగానీ బిడ్డకు కడుపునొప్పి అనే మాటవినేసరికి దిగ్గున పక్కమీద లేచి కూచున్న సంతోష్ ఒక్క ఉదుటన బిడ్డ శ్రీకరి పడుకున్న రూముకు వెళ్ళాడు. బిడ్డ అంటే సంతోష్‌కు ప్రాణం. రోజూ చూస్తున్నదే అయినా శ్రీకరిని మళ్ళీ ప్రేమగా చూడసాగాడు. "ఎంత చక్కగా హాయిగా పడుకుందో... ఒకరోజు స్కూలుకు పోకపోతే ఏం కొంపలు మునుగుతాయంట'' అనుకుంటూ అలాగే నుంచుండి పోయాడు.



ఇక తప్పదనుకున్న సంతోష్ మెల్లిగా శ్రీకరి పక్కగా కూచుని "నానీ-బంగారం" అని మెల్లిగా పిలిచాడు. నిద్దర్లోనే "హాయ్ డాడీ' అంటూ తన నడుముని చుట్టేసి తొడపై తలపెట్టుకుని పడుకుంది. మెల్లగా తల నిమురుతూ అడిగాడు 'ఏం నాన్నా ఇవాళ స్కూలు డుమ్మానా?" 5వ తరగతి చదువుతున్న శ్రీకరి కళ్ళు తెరవలేదు.

"అబ్బా... కడుపు నొప్పి డాడీ. ఇవాళ ఒక్కరోజు ప్లీజ్"గారాబం చేసింది.

"ఏదీ ఎక్కడ చూపించు. ఎప్పటి నుండి వస్తోంది నొప్పి"? కంగారుగా అడిగాడు.

"అదీ... అదీ... ఎక్కడ అంటే, మొత్తం డాడీ... రాత్రంతా నొప్పి" మరింత అల్లుకుపోయింది.

"అయ్యో... సర్లే.. నువ్వు పడుకో బేటా.. నేను టీచర్‌కి చెప్తాలే ఫోన్‌చేసి" అనునయించాడు.

"మరి మమ్మీకి?" అసలు భయాన్ని బైటపెట్టింది పాప.

"నే చూస్కుంటా కదా! నువ్వు బజ్జుకోరా" హామీ యిచ్చి చెద్దరు కప్పి వెళ్ళిపోయాడు.

× × ×

అరగంట తర్వాత తన డాక్టర్ స్నేహితుడు పాషాతో ప్రత్యక్షమయ్యాడు సంతోష్. కూతురుని మెల్లగా లేపసాగాడు. "ఇదిగో నానీ చూడు పాషా అంకుల్ వచ్చాడు. ఒక్కసారి నీ కడుపునొప్పి గురించి అంకుల్‌కి చెప్పురా" అనేసరికి దిగ్గున లేచికూచుంది

శ్రీకరి. ఏం చేయాలో అర్థం కాలేదు తనకి. "హాయ్ అంకుల్" అని పాషాని విష్‌చేసి "డాడీ ఓసారి బైటికిరా" అన్నట్లు కళ్ళతోటే సైగచేసింది. ఏం మాట్లాడకుండా తనని అనుసరించాడు. "ఎందుకు లేచావురా? నొప్పి ఎలా ఉంది. మన అంకులేగా భయపడకు. ఇంజక్షన్ వద్దని నేను చెప్తాలే పద'' కంగారు కంగారుగా మాట్లాడుతున్న సంతోష్‌ను గట్టిగా అల్లుకొని ఏడ్వసాగింది పాప. సంతోష్ ఇంకా గాబరా పడిపోయాడు.




"ఏమైందిరా... నొప్పి ఎక్కువగా ఉందా? నో ప్రాబ్లమ్. చిటికెలో మాయం చేసేస్తాడు మా ఫ్రెండు. ఏడవకు నాన్నా. నేనున్నాగా'' అనునయించాడు సంతోష్.

"అయామ్ సారీ డాడీ.. వెరీ సారీ" అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

''ఇందులో నీ తప్పేముందిరా. కడుపునొప్పి రావటం నేరమేం కాదుగదా?"

"అదికాదు డాడీ.. అది అదీ నిజం కాదు" ఏడుపు మధ్యలోనే చెప్పింది.

''ఏయ్ ఇంజక్షన్‌కు భయపడి నువ్వలా చెప్తున్నావని నాకు తెలుసు. పద అంకుల్ దగ్గరికి"

''మాథ్స్ హోంవర్క్ చేయలేదని, టీచర్ కొడతారని భయపడి అబద్ధం చెప్పాను డాడీ"

"నిజమా.. నువ్వు అబద్ధం చెప్పావంటే నేను నమ్మను. నిజం కాదుగదా"

"అయ్యో డాడీ అందుకే సారీ...సారీ.. సారీ... నాకు ఏ కడుపునొప్పీలేదు. డుమ్మా కొడతానంటే మమ్మీ కూడా ఒప్పుకోదేమోనని అబద్ధం చెప్పా" ఏడుపు ఏడుస్తూనే ఉంది.

బిడ్డను దగ్గరగా తీసుకొన్నాడు. తను కూడా ఒకింత షాక్‌లోనే ఉన్నాడు.


"చూశావా నానీ... ఒక చిన్న అబద్ధం నిన్ను నన్ను ఎంత బాధకు గురిచేసిందో. స్కూలు ఒకరోజు పోతే పెద్ద నష్టం లేదు. కానీ నువ్వెప్పుడూ అబద్ధం చెప్పవన్న నమ్మకం పోతే, నీమీద ఉన్న ప్రేమ మాయమైపోతే తట్టుకోగలవా? ఆలోచించు! అమ్మ కూడా నీకోసం ఎంత బాధపడిందో తెలుసా. అమ్మ బలవంత పెడితేనే నేను డాక్టర్ అంకుల్‌ని తీస్కుని వచ్చా" సుతిమెత్తగా హితబోధ చేశాడు తండ్రి. హోమ్ వర్క్ కోసం ఇలా అబద్దాలు చెప్పి తప్పించుకోవడం మంచిది కాదు. ఆ రోజు మిగతా పాఠాల పని సంగతి ఆలోచించు.

"ఇంకెప్పుడూ అబద్ధం చెప్పను... ఒట్టు. సారీ మమ్మీ"

**– పెనుగొండ బసవేశ్వర్**



# హార్న్‌బిల్



పొడవైన పెద్ద ముక్కు, దానిపై టోపీ లాంటి అమరిక, ముక్కును మించిన పొడవుతో తోక, నలుపు తెలుగు రంగుల పెద్ద ఈకలు, పెద్ద శబ్దంతో కూత వేస్తూ, చిత్ర విచిత్రమైన అలవాట్లతో, గమ్మత్తుగా అనిపించే హార్న్‌బిల్ అనే పక్షి అస్సాం అడవుల్లో కనిపిస్తుంది. ఇది గద్దకన్నా కొంచెం పెద్దది. ఇది 30 సెంటీమీటర్ల బలమైన ముక్కుతో కలిపి దాదాపు 5 అడుగుల పొడవు ఉంటుంది. ముక్కు ముదురు పసుపు రంగులో దానిపై టోపీలాంటి అమరిక నలుపు పసుపు రంగుల్లో ఉంటుంది. తోక తెలుపు రంగులో ఉండి కింద అడ్డంగా చిన్నపట్టీ ఉంటుంది. పొట్ట భాగంలో ఈకలు తెలుపుగా ఉంటాయి. ఈ పక్షి దట్టమైన అడవుల్లోనే నివసించడానికి ఇష్టపడుతుంది. పెద్ద చెట్లకున్న చిన్న తొర్రల్లో ఉంటుంది. చిన్న గింజలున్న పండ్లు, పురుగులు, ఎలుకలు, బల్లులు, చిన్న పాములను ఇది ఇష్టంగా తింటుంది. ఇది ఎగురుతుంటే రెక్కల శబ్దం గమ్మత్తుగా వస్తుంది.

ఆడ మగ హార్న్‌బిల్ పక్షులు కలిసి ఒక చెట్టు తొర్రను ఇంటిగా చేసుకొంటాయి. అందులో ఆడపక్షి రెండు నుండి నాలుగు గుడ్లను పెడుతుంది. తర్వాత గుడ్లమీద పొదగడానికి కూర్చుంటుంది. అప్పుడు మగ పక్షి ముక్కును తాపీలా ఉపయోగించి రెట్టా, మట్టితో చెట్టు తొర్ర ద్వారాన్ని మూసి వేస్తుంది. దానికి ఒక చిన్న కన్నం మాత్రం ఉంచుతుంది. దీని నుంచి మగపక్షి ఆడపక్షికి ఆహారం అందిస్తుంది.

గుడ్లు పొదిగి పిల్లలు బయటికి వచ్చి రెండు నెలల వయస్సు వచ్చే వరకు ఆడపక్షి ఆ గూటిలోనే ఉంటుంది.

అంటే దాదాపు నాలుగు నెలలు ఆ గూటిలోనే ఎటూ కదలకుండా ఉంటుంది.

పిల్లలు ఎదిగి వాటంతట అవే ఆహారం సంపాదించుకునే స్థితికి రాగానే మగపక్షి గూటిని ముక్కుతో పగలగొడుతుంది.

అపుడు తల్లి, పిల్లలు బయటికి వచ్చి స్వేచ్ఛగా ఎగురుతాయి.

# "స్ఫూర్తి"



రాజయ్య చేతిలో కఱ్ఱ, సద్ది పట్టుకుని, సైకిల్ ఎక్కబోయాడు. నాన్న ఈ రోజు పొలంకాడికి నేను వస్తానంటూ శ్రీపాల్ కఱ్ఱ, సద్ది తీసుకుని, సైకిల్ వెనకాల ఎక్కాడు. "ఈరోజు సెలవు నక్కగా ఆడుకో వచ్చుగా, నాతోవస్తావా! అల్లరి చేయొద్దు మరి" అంటూ రాజయ్య సైకిల్ తొక్కుతూ పొలం వద్దకు చేరాడు.

పొలం వద్దకు చేరగానే పరుగున శ్రీపాల్ వెళ్ళి జామచెట్టుపైకి ఎక్కి పండ్లు, కాయలు తెంపుతూ జేబులలో వేసుకుంటూ చెట్టుపైననే తినసాగాడు. శ్రీపాల్ కోతిచేష్టలకు ముసిముసిగా నవ్వుకుంటూ రాజయ్య పొలం గట్లు తిరుగుతూ, గల్మలు సరి చేయ సాగాడు. పశువుల పాక ఊడ్చి, పశువులను మైదానంలోకి పంపాడు. నెమ్మదిగా చేను చుట్టూ తిరుగుతూ సద్ది తీసుకుని శ్రీపాల్ దగ్గరకు వచ్చాడు రాజయ్య.

శ్రీపాల్ రారో! అడవిలోకి వెళ్ళాలి అన్నాడు రాజయ్య. అడవిలోకి వెళ్ళదామనగానే శ్రీపాల్‌కు సంతోషం అన్పించింది. కోతులు, నెమళ్ళు, కుందేళ్ళు, పక్షులు ఎన్నో చూడొచ్చని శ్రీపాల్ గబగబ సద్ది తిన్నాడు. రాజయ్య పెద్ద తాడు తీసుకుని, గొడ్డలిని చేతిలో పట్టుకొని అడవిలోకి బయలుదేరాడు. రాజయ్య వెనకాలే శ్రీపాల్ వెళ్ళసాగాడు. పొదలు దాటుకుంటూ, రాళ్ళు, రప్పలు, ముళ్ళను తగలకుండా వెళ్ళుతున్నారు. పక్షుల అరుపులు వింటుంటే శ్రీపాల్‌కు సంతోషం అన్పించింది.

కొద్ది దూరం వెళ్ళాక రాజయ్య చేతిలోని తాడు కిందవేసి, ఒక చెట్టును కొట్టబోయాడు. వెంటనే శ్రీపాల్ తండ్రిని చెట్టును కొట్టడం ఆపించాడు. చెట్టును ఎందుకు కొడుతున్నావ్? ప్రశ్నించాడు. మనం వంట

చేసుకోవడానికి కట్టెలు కావాలి అందుకు అన్నాడు రాజయ్య కోపం ప్రదర్శిస్తూ, పక్కకు జరుగుతున్నాడు.

వంటకు కట్టెలు కావాలంటే దారిలో చాలా కన్పించాయిగా అన్నాడు శ్రీపాల్. రాజయ్య కళ్ళు కోపంతో ఎఱ్ఱబారాయి. నేను ఒక్కోపుల్ల ఏరుకొని తీసుకెళ్ళాలా? ఒక్కచెట్టు కొట్టుకుపోతే పదిరోజులు సరిపోతాయి. అంటూ గొడ్డలితో చెట్టును రాజయ్య కొట్టబోయాడు.

శ్రీపాల్ రాజయ్యను గట్టిగా కౌగలించుకుని. చెట్లు కొట్టవద్దని కన్నీరు కార్చసాగాడు. రాజయ్య ఆశ్చర్యపోయాడు. గొడ్డలి కిందవేసి శ్రీపాల్ కన్నీళ్ళు తుడుస్తూ, చెట్టు కొట్టవద్దని నీకు ఎవరు చెప్పారు. అని రాజయ్య అడిగాడు.

నాకు ఎవరు చెప్పడం ఏంది? మరి పుస్తకాలలో పాఠాలు వున్నాయి. చెట్లనీడను ఇస్తాయి. పండ్లను ఇస్తాయి. చల్లని గాలితో ఆయుష్షును పెంచుతూ పశువులు, పక్షులు, జంతువులకు నీడనిచ్చి రక్షిస్తాయని అటువంటి చెట్లను కొట్టవద్దని వెక్కి వెక్కి ఏడుస్తూ, చెట్లు లేకపోతే వర్షాలు రావని, పంటలు పండవని. పర్యావరణ కలుషితం అవుతుందని రాజయ్యను కౌగలించుకున్నాడు.

శ్రీపాల్ చదువుకున్న విషయాలన్ని చెప్పగానే రాజయ్య చెట్టుకొట్టడం మానుకుని శ్రీపాల్‌కు ముద్దులు ఇచ్చాడు. పక్షులు సంతోషంతో అరుస్తూ శ్రీపాల్‌కు బై బై చెప్పాయి. రాజయ్య కిందపడిన కొమ్మలను మోపుకట్టి ఇంటికి తీసుకెళ్లాడు. ఎవరైనా అడవిలో చెట్లు నరకబోతే వద్దని, ఇంట్లో మీ పిల్లలను అడగండి చెట్ల వలన ఉపయోగం అంటూ పిల్లల మాటలను "స్ఫూర్తిగా" తీసుకుని ప్రకృతిని రక్షించుకుందా మంటూ రాజయ్య అందరికి హితబోధ చేసాడు.

– ఉండ్రాల రాజేశం

## క్రీడలు

పిల్లలు ఎంతగానో ఇష్టపడాలి, వారికి ఎంతో అవసరం అయిన కొన్ని క్రీడా కార్యక్రమాలు : ఈ క్రీడలకు ఉపయోగించదగిన, తేలికగా లభించే కొన్ని వస్తువులు.




| | | | |
|---|---|---|---|
| పరుగెత్తటం | కట్టటం | మెట్లు | గాలిపటాలు |
| గెంతటం | సాగటం | డబ్బాలు | కఱ్ఱచెక్కలు |
| ఎత్తటం | ఊగటం | బంతులు | బల్లలు |
| ఎగరటం | ఈదటం | చెట్లు | బెలూన్లు |
| జారటం | దొర్లటం | ఇటుకలు | కఱ్ఱపలకలు |
| మోయటం | పిల్లిమొగ్గలు | తొట్లు | పూలతొట్లు |
| కుందటం | వేయటం | స్తంభాలు | చేతి రుమాళ్ళు |
| బాలన్సు చేయటం | నాట్యం చేయటం | త్రాళ్లు | కొలనులు |
| తొయ్యటం | గోడలు | గొడుగులు | కాగితాలు |
| లాగటం | పెట్టెలు | బండలు | బట్టలు |
| పాకటం | బకెట్లు | టైర్లు | గుంటలు |
| లాగటం | | | |




– మీనాస్వామినాథన్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.



### చెలిమి క్లబ్

మెంబర్ షిప్ నెం. : ---------------

పేరు : ----------------------

తండ్రి పేరు : ----------------------

తరగతి : ----------------------

పుట్టినతేదీ : ----------------------

హాబీలు : ----------------------

చిరునామా : ----------------------

----------------------

----------------------

పిన్ : ----------------------

ఇ-మెయిల్ : ----------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



# ప్రయాణం



తరుణ్, కరుణ ఇద్దరూ హైద్రాబాద్‌లో 8వ తరగతి, 6వ తరగతి చదువుతున్నరు. ఒకరోజు వారి మామయ్య యింట్లో పెళ్లికి మామిడిపల్లికి బయలుదేరారు. మామిడిపల్లి ఒక పల్లెటూరు. మామయ్య ఊరైనప్పటికీ ఎప్పుడూ వెళ్లలేదు. సిటి నుండి కారులో 4 గంటల ప్రయాణం. సిటీ దాటగానే వాళ్లకు దారి పొడుగునా చెట్లు, అక్కడక్కడా పంట పొలాలు, ఎద్దులు, పొలం దున్నే రైతులు కనబడ్డరు. పచ్చటి పొలాలను పిల్లలు మొదటిసారి చూస్తున్నరు. పొడవైన తాటిచెట్లు కూడా ఎప్పుడూ చూడలేదు. ఒక దున్నిన పొలంలో మగ నెమలిని చూసి సంబరపడ్డరు. తాటిచెట్టు పైకి ఉడుతలు ఎక్కుతున్నయి. సెలవు రోజు పార్కుకు, హోటళుకు వెళ్లడం తప్ప బయటి ఊరికి వెళ్లలేదు. నోళ్లు తెరుచుకొని వాటన్నిటిని ఆశ్చర్యంగా చూస్తున్నరు. అమ్మ నాన్నలను విసిగిస్తూ, సెల్లులో కార్టూన్లు చూస్తూ గడిపే తరుణ్, కరుణలు

పరిసరాలను ఆసక్తిగా చూస్తూ వెళుతున్నరు.

చిన్నగా వర్షం మొదలైంది. చినుకులు కారు అద్దాలపై పడి మెరుస్తున్నవి. కారులో ఏసీ ఆపివేసి అద్దాలు కొద్దిగా కిందికి దించారు.

చల్లని గాలికి హాయిగా అనిపించింది. వాళ్ల అమ్మనాన్నలు పిల్లల సంబరాన్ని చూసి ముసిముసిగా నవ్వుకున్నరు. తెచ్చుకున్న చిరుతిండ్లు తినడం కూడ మరిచిపోయింద్రు వాళ్లు. కరెంటు తీగపై పాలపిట్టను అమ్మనాన్నలకు చూపించారు. తరుణ్, కరుణలు దారి పొడుగునా కనిపించిన వాటిని ఒకరికొకరూ చూపించుకుంటూ మురుస్తున్నరు. వారికి నాల్గు గంటల ప్రయాణంలా అనిపించలేదు. మామిడిపల్లి తొందరగా వచ్చినట్లనిపించింది.

మామయ్య యింటిముందు కారు ఆగింది. సరదా సరదాగా కారు దిగారు. మామయ్య వారి దగ్గరకు వచ్చి హత్తుకొని తల నిమిరాడు. ఇంట్లో కొంతమంది బంధువులున్నరు. పిండి వంటల వాసనలు ఘుమ ఘుమలాడుతు నోరూరిస్తున్నవి. అస్తమానం పుస్తకాలతో కుస్తీ పట్టే పిల్లలకు అక్కడి పండగ వాతావరణం, ఆడుకుంటున్న తమ ఈడు పిల్లలను చూసి ఆనందం వేసింది. ఆ రాత్రి పిల్లలందరూ ఆరుబయట నక్షత్రాలను చూస్తూ, కథలు చెప్పుకుంటూ పడుకున్నరు. సంపత్, సునీత, రాజు మొదలైనవారు వారికి దోస్తులయింద్రు.

మరుసటి రోజు దగ్గరలో వున్న చెరువును చూడడానికి మనిషిని యిచ్చి పంపిండు మామయ్య. చెరువు చాలా పెద్దగా వుంది. సూర్యుని కిరణాలు పడి తళతళ మెరుస్తున్నది. కొద్ది దూరంలో మామిడి చెట్లున్నవి. అక్కడక్కడ ఆకుల చాటున మామిడికాయలు, చెట్లపై ఎగురుతున్న కోతులు, కరుణ, తరుణ్ బయలుదేరినప్పటి నుండి ఎన్నో పక్షులను, జంతువులను చూసింద్రు. హైద్రాబాద్‌లో అవన్ని ఎందుకు లేవో, రాత్రి మెరుస్తూ కనిపించిన చుక్కలు ఎందుకు కనిపించవో వారికి అర్థం కాలేదు. తల్లికోతి తన పిల్లను పొట్టకు కరచుకొని పోవడాన్ని వింతగా చూసింద్రు. కొన్ని చిన్న రాళ్లు తీసికొని పిల్లలు కోతులమీద విసిరింద్రు. పెద్ద కోతి గుర్రుగా చూసింది. సంపత్ ఒక రాయిని ఉడుత పైకి విసిరిండు. అది తుర్రుమని చెట్టెక్కింది. తాము మాటి మాటికి రాళ్లు విసరడం తరుణ్‌కు నచ్చలేదు. చెరువుకు దగ్గరగా వెళ్లింద్రు. తుమ్మచెట్లపై తెల్లని కొంగలు చెరువు బయటకు వస్తున్న చేపలను చూస్తున్నవి, జాలరి చేపలకై వల విసిరిండు.

నీటిపై నుండి చల్లని గాలి వీస్తున్నది. ఇంట్లోని ఏసీ గాలికంటే హాయిగా వుంది. చెరువు కట్టను కడుతున్నరు. అక్కడే వేసిన ఇసుకలో కాళ్లు, దాచుకుంటూ గూళ్లు కట్టుకున్నరు. మొదటిసారిగా మట్టిలో ఆడుకున్నరు. పిల్లలందరూ బాల్యాన్ని మొదటిసారిగా చవిచూశారు. కొత్త అనుభూతి, పుస్తకాలతో కుస్తీ లేదు. కాంక్రీటు జంగిల్లో కంటే మట్టి నేలపై ఆట నచ్చింది, వారికి. అలసిపోయినంక యింటి కొచ్చింద్రు. పెళ్లి సంబరాల్లో వున్న బంధువులు తమను దగ్గరకు తీసుకుని ముద్దాడడం అప్పుడు సిగ్గుపడడం కొత్తగా అనిపించింది.

పెళ్ళి తరువాత తిరుగు ప్రయాణమయ్యింద్రు. కరుణ, తరుణ్ ముఖాలు సంతోషంతో విప్పారి ఉన్నయి. మామిడిపల్లి బాగా నచ్చింది వారికి. ఆనందంతో వెలుగుతున్న పిల్లలు ముఖాలను చూసి తల్లిదండ్రులు తృప్తిగా ఒకరి ముఖాలను ఒకరు చూసుకున్నరు. అవును మరి జీవితానికి భరోసానిచ్చే ఆనందాన్ని ఆత్మవిశ్వాసాన్ని వెంట తీసుకుని పోతున్నరు కరుణ, తరుణ్.

పల్లె వాతావరణాన్ని మనస్సుల్లో భద్రపరచుకొని పట్నంలో చూపడానికి ప్రయాణం.

– గద్వాల కిరణ్‌కుమారి



# మరో గ్రంథాలయ ఉద్యమ సభ విజయవంతం...

రెండు తెలుగు రాష్ట్రాల నుండి పుస్తక ప్రియులు, గ్రంథాలయ ఉద్యమకర్తలు హాజరైన హైదరాబాద్ మరో గ్రంథాలయ ఉద్యమ మహాసభ హిమాయత్ నగర్‌లోని ఆక్స్ఫర్డ్ పాఠశాలలో ఆదివారం విజయవంతంగా జరిగింది.

మరో గ్రంథాలయ ఉద్యమ కమిటీ నిర్వహణలో ఉదయం 10:00 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన గ్రంథాలయ మహాసభలో చరిత్రలోకి నడిచిన గ్రంథాలయ వ్యవస్థ, డిజిటల్ కాలంలో గ్రంథాలయాల అభివృద్ధి - మన కర్తవ్యాలు, తెలంగాణలో నడుస్తున్న విభిన్న గ్రంథాలయాలు- ప్రయోగాలు అనుభవాలు, మరో గ్రంథాల ఉద్యమ భవిష్యత్ కార్యాచరణ అంశాలపై దశలవారీగా అతిథులు మరియు గ్రంథాలయ ఉద్యమకర్తలు చర్చించడం జరిగింది.

సాహితీవేత్తలు వేదకుమార్, భూమన్, కవి యాకూబ్, కరికులం కమిటీ మెంబర్ సిపి ప్రసాద్, విద్యావేత్తలు ఎన్. ఉపేందర్ రెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, వి ఆర్ శర్మ, కథకులు పూదూరి రాజిరెడ్డి, జగదీశ్వర్ రావు, జి. వెంకటకృష్ణ, ఉమామహేశ్వర్, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, వాసిరెడ్డి నవీన్, కత్తి పద్మ, శాంతారావు, మంచి పుస్తకం సురేష్, జిఎస్ చలం, అప్స శ్రీనివాస్, హరిత, యజ్ఞమూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని గ్రంథాలయాల అభివృద్ధికై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి మాట్లాడారు.

గ్రంథాలయ ఉద్యమాన్ని నూతన సాంస్కృతిక ఉద్యమంగా తీర్చిదిద్దాలని భక్తులు అన్నారు. పుస్తకాలను ప్రతి ఒక్కరికి చేరువ చేసే ప్రయత్నం కవులు, రచయితలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని అన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నిర్వహణ కమిటీ సభ్యులు మంచికంటి, నారాయణ వేణు, కాసుల రవికుమార్, దశరథ్, సంజీవి మరో గ్రంథాలయ ఉద్యమ మహాసభను సమన్వయం చేశారు.

- మంచికంటి
9949535695



బాలసాహితీవేత్త
గరిపల్లి అశోక్‌ను
సన్మానిస్తున్న దృశ్యం



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాడభూషి లలితాదేవి,
డా॥ చెరుకుపల్లి హారిక, మణికొండ వేదకుమార్,
పైడిమర్రి గిరిజ, తిరునగరి వేందాత సూరి, గరిపల్లి అశోక్



మొలక బాలల పత్రిక
సంపాదకులు
తిరునగరి వేదాంత సూరిని
సన్మానిస్తున్న దృశ్యం

# మాడభూషి రంగాచార్య స్మారక
# కథల పోటీ బహుమతుల ప్రదానోత్సవం


మాడభూషి రంగాచార్య స్మారక సంఘం వారు గత ఇరవై యేళ్లుగా బాలసాహిత్య రంగంలో చేస్తున్న కృషి ఎంతో శ్లాఘనీయం. ప్రతి ఏటా నవంబరు నెలలో హైదరాబాద్‌లోని పాఠశాలల బాలబాలికలకు కథల పోటీ నిర్వహిస్తుంది. అందులో బాగున్న కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పదకొండు ప్రోత్సాహక బహుమతులను మార్చి 11న అందజేయడంతో పాటు ఇద్దరు బాల సాహితీవేత్తలను సన్మానించడం జరుగుతుంది. ఈ యేడాది మార్చి 11న హైదరాబాద్ నగరంలోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో గిరిజ పైడిమర్రి అధ్యక్షతన స్మారక సమావేశం జరిగింది. సంస్థ కన్వీనర్ మాడభూషి లలితాదేవి సాహితీరంగంలో తమ సంస్థ చేస్తున్న కృషిని వివరించారు.

ముఖ్య అతిథిగా చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఛైర్మన్, దక్కన్‌ల్యాండ్, బాలచెలిమి పత్రికల సంపాదకులు మణికొండ వేదకుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాలసాహితీవేత్త డా. సిరి రాసిన 'రాచ ఏనుగు' బాలల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాల సాహితీవేత్తల సన్మానం, విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. వేదకుమార్ తన ప్రసంగంలో విద్యార్థులలోని సృజనాత్మక శక్తులను వెలికి తీయాలని, ఆ బాధ్యత ప్రధానంగా ఉపాధ్యాయులది, తల్లిదండ్రులది అని చెప్పారు. అలాంటి పిల్లలకు తాము ఎల్ల వేళలా అండగా ఉంటామని చెపుతూ... ఆ సందర్భంలో బహుమతులు అందుకున్న పిల్లలకు బాలచెలిమి పత్రికను సంవత్సరం పాటు ఉచితంగా అందజేస్తామన్నారు. పిల్లలు రాసిన సృజనాత్మక రచనలను తమ పత్రికలో ప్రచురిస్తామని చెప్పి వాళ్ళను ప్రోత్సహించారు. బాల సాహిత్యరంగంలో మాడభూషి రంగాచార్య స్మారక సంఘం చేస్తున్న కృషిని కొనియాడారు. సన్మాన గ్రహీత మొలక బాలల పత్రిక సంపాదకులు తిరునగరి వేదాంత సూరి మాట్లాడుతూ... వార్త దినపత్రికలో మొగ్గ పిల్లల పేజీకి తాను చాలా కాలం ఇన్‌చార్జిగా పనిచేసానని ఎంతోమంది మొగ్గ (పిల్లలు) పాఠకులు ఈనాడు ఉన్నతస్థానంలో ఉన్నారని, పిల్లలు అనుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదని అన్నారు.

సన్మానగ్రహీత బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ మాట్లాడుతూ.. మునుపెన్నడూ లేనంత విస్తృత స్థాయిలో ఈనాడు బాల సాహిత్యం వస్తున్నదని, బడి పిల్లలే తమ జీవితంలోని సంఘటనలను కథలుగా రాస్తున్నారని తెలిపారు.

ఈ కథల న్యాయ నిర్ణేతగా బాలసాహితీవేత్త డా. హారిక చెరుకుపల్లి మాట్లాడుతూ.. అన్ని కథలూ బాగున్నాయని, కానీ పోటీ అన్నాక కొన్ని కథలను మాత్రమే ఎంపిక చేయడం తప్పదని, బహుమతి రాని పిల్లలు నిరుత్సాహపడవద్దని చెపుతూ పిల్లలు రాసిన నాలుగు కథలను సమీక్షించారు. సెల్‌ఫోనును అర్థవంతంగా ఎలా ఉపయోగించవచ్చునో తెలిపే కథ ప్రథమ బహుమతికి ఎంపికైంది. దీనిని ఎనిమిదో తరగతి చదివే మాంకాల ఉజ్వల రాసింది. మార్కులే కొలమానం కాదంటూ... జడ్.పి.హెచ్.ఎస్. బొల్లారం ఎనిమిదో తరగతి విద్యార్థి గణపతి వెంకట్రావు రాసిన కథ ద్వితీయ బహుమతి పొందింది.

– పైడిమర్రి గిరిజ
m : 9949443414



యాత్ర

# అక్కమహాదేవి గుహలు

ఫరహాబాద్ గేట్ నుండి శ్రీశైలం రూట్‌లో వటవర్లపల్లి మీదుగా సుమారు 18 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన తరువాత కుడి వైపున్న లోయలో 'అక్కమహాదేవి గుహలకు దారి' అనే బోర్డు కనిపిస్తుంది. అక్కడి నుండి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం ఆహ్లాదకరమైన ప్రకృతిలో వెలగపండ్లు, పరికి పండ్లు తింటూ ట్రెక్కింగ్ చేసి శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్స్ అంచున ఉన్న అరుదైన గుహలను చేరుకోవచ్చు. క్రీ.శ. 12వ శతాబ్దంలో ఈ గుహల్లో కర్ణాటక నుంచి వచ్చిన శివభక్తురాలు శ్రీశైలం శివుణ్ని సేవించి తరించడంతో ఆమె పేరు మీద వీటిని అక్కమహాదేవి గుహలు లేదా అక్కమ్మ బిలం అంటున్నారు.

ముందుగా మనల్ని సహజ శిలాతోరణం ఆహ్వానిస్తుంది. తూర్పు పడమర దిక్కుల మధ్య సుమారు 50 గజాల దూరంతో రెండేసి స్తంభాలు ఇరువైపులా సహజంగా ఏర్పడిన వాటిపైన రెండు గజాల మందం, నాలుగు గజాల వెడల్పు, 55 గజాల పొడవు ప్రమాణాలకో ఉన్న ఒక చదునైన బండ పొందించినట్లున్న సహజమైన ఏర్పాటుంది. ఈ బండ (పందిరి) కింద సుమారు వేయి మంది నిల్చోవచ్చు. ఏవైనా ఆహ్లాదకరమైన కార్యక్రమాలు నిర్వహించు కోవచ్చు.



చిన్న కథ

# నిద్ర

బిందుకు స్కూలంటే ఇష్టమే... కానీ బయలుదేరి వెళ్లాలంటేనే బద్ధకం. ఉదయం పెందలాడే లేవకుండా ఏడు గంటల వరకు అలా ఉత్తినే కళ్లు మూసుకొని పడుకొని నిద్రపోయినట్టే నటిస్తుంది. బిందు చదువుతుంది యూకేజీ. అమ్మ పనుల్లో పొయ్యి దగ్గర లీనమై ఉంటే, నానమ్మ ప్రేమతో మెల్లగా తట్టి లేపి స్కూలుకి సిద్ధం చేసి పంపిస్తుంది రోజూ.

ఆ రోజు ఆదివారం... రోజూ ఏడు గంటల వరకు అలా పడుకునే బిందు ఈ రోజు ఆరు గంటలకే నిద్ర లేచి కూచుంది. "ఏమే బిందూ పడుకోక అప్పుడే లేచావ్" అంది నానమ్మ.

"ఈ రోజు సండే కదా. హాలిడే నానమ్మా, స్కూలుండదు" అన్నది చిన్నారి బిందు.

– భూపాల్

# నేనూ నా బాల్యం

"నాకు చిన్నప్పుడు అందరిలాగే చెట్లెక్కాలనీ, కింద పడాలనీ, ఆడుకోవాలనీ, దొరల్లాలనీ ఉండేది. కానీ నేను నా చిన్నతనాన్నే పెద్దవాణ్ణయిపోయాను. 'ఐ మిస్‌డ్ మై చైల్డ్ లైఫ్' అంటారాయన బాధపడుతూ, చిన్నతనాన్ని తలుచుకుంటూ, – తన బాల్యం గురించి ఎవరైనా అడిగితే..

ఆయనెవరో తెలుసా? ప్రపంచంలోని పలు దేశాల్లో సంగీత కచేరీలు చేసి ప్రశంసలందుకున్న 'శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ'.



నేను పుట్టిన పదిహేను రోజులకే మా అమ్మ చనిపోయింది. పెద్దమ్మే పెంచి పెద్ద చేశారు. మా నాన్నగారి పేరు పట్టాభిరామయ్య. ఆయన సంగీత విద్వాంసులు. మ్యూజిక్ టీచర్‌గా పని చేసేవారు. నాకు సంగీతం ఎక్కువ శ్రమ పడకుండానే అబ్బింది. నాకు సంగీతం వచ్చన్న సంగతి చాలా రోజుల తర్వాత నాకు తెలిసింది. నా ఎనిమిదవ ఏట నుండే కచేరీలు చేయడం మొదలెట్టాను. నాకు తొమ్మిదేళ్ళు ఉన్నప్పుడు విజయవాడలోని గవర్నర్ పేటలో ఉన్న మున్సిపల్ స్కూలులో ఓ ఆర్నెల్లపాటు చదివాను. కానీ చదువు ఒంట పట్టలేదు. నేను స్కూలుకు వెళ్ళగానే నా తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు నన్ను పాటలు పాడమనే వారు. దాంతో మా స్కూలు హెడ్మాస్టరు మా నాన్నను పిలిచి 'మీ అబ్బాయికి చదువు ఒంట పట్టడం లేదు. ఏదో పాడుతున్నాడు కదా! అందులోనే బాగా శిక్షణ ఇప్పించు' అన్నారు. ఆ విధంగా నేను సంగీతం మొదలెట్టాను.

నాకు గాత్ర సంగీతంలోనే గాక, వాద్య సంగీతం లోను ప్రవేశం ఉంది. వయోలిన్, మృదంగం వంటి వాయిద్యాలు వాయించగలను. సంగీతంలో జబ్బులు నయం చేసే చికిత్సా విధానం (మ్యూజిక్ థెరపీ) గురించి పరిశోధన చేస్తున్నాను.

నాకిప్పుడు మనమలు, మనమరాళ్ళు ఉన్నారు. నేను పోగొట్టుకు న్న బాల్యాన్ని ఇప్పుడు వారితో అనుభవిస్తున్నాను. అప్పుడప్పుడు పిల్లలతో కలిసి పిల్లవాడిలా, పిల్లల పుస్తకాలు చదువుతూ, హాయిగా గడుపుతున్నాను. అంటే నేను పెద్దవాణ్ణి అయ్యాక చిన్నవాణ్ణి అవుతున్నాను.

నా చిన్నప్పటికీ, ఇప్పటికీ పిల్లల్లో చాలా తేడా వచ్చింది. ఈ రోజుల్లో పిల్లలు చాలా తెలివైన వాళ్ళు. వాళ్ళలోని టాలెంట్‌ను గుర్తించి, ప్రోత్సహమిస్తే ఎంతైనా పేరు తెచ్చుకోగలరు. పిల్లలకు దేని మీద శ్రద్ధ ఉంటే అదే నేర్పడం తల్లితండ్రుల బాధ్యత. రష్యాలో అలాగే నేర్పుతారు. పిల్లలు కూడా అనవసరమైన విషయాల్లో తలదూర్చకుండా, లేనిపోని ఆందోళనలకు లోనవకుండా బాల్యాన్ని ఆటపాటలతో, చదువు సంధ్యలతో ఆనందమయం చేసుకుంట జీవితం సుఖమయం అవుతుంది.

(పాతికేళ్ళ కిందట ఈ ప్రఖ్యాత గాయకుడి గురించి పిల్లలకు పరిచయం చేయాలని భావించి బాల చెలిమి వ్యవస్థాపకులైన వేదకుమార్ ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ కథనం ప్రచురించారు)

**(నవంబర్ 1990 బాల చెలిమి)**

CENTRAL BOOKS
SINCE 1947

Your trusted Academic Partner - Then, Now & Forever

DIAMOND JUBILEE
CELEBRATING 75 YEARS OF KNOWLEDGE, TRUST & LEADERSHIP



| 12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Digital Learning | Books and Stationery Supplies |
|---|---|---|---|---|---|

Head Office : 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282

Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.

Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - 25th March, 2024

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com